# ఊరికి పోయిన యాళ్ళ...



మామిడి హరికృష్ణ

కవిత్వం

ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. సైకాలజీలో చేరిన రోజుల్లోనే తెలంగాణ భాషలో నేను కవిత్వం, కథలు రాయడం, ఇతర రచనలు చేయడం షురువయింది. అప్పటి సంది, ఏదో ఒక సందర్భంలో నేను తెలంగాణా భాషలో కవిత్వం రాస్తూనే ఉన్నా! నన్ను ఆలోచింపచేసిన, నన్ను స్పందింప చేసిన అంశాలు, సంఘటనలు, వస్తువుల మీద తెలంగాణ కవితలు ఎన్నో రాసాను. తెలంగాణ భాష, తెలంగాణ ప్రజాజీవనం ఎంత సులభంగా, సుళువుగా, సరళంగా ఉంటుందో అంతే సాదాసీదాతనం నా కవిత్వంలో ప్రతిబింబించాలనే ఉద్దేశంతో కవిత్వంలో సంక్లిష్టత (Complexity), సందిగ్ధత (Ambiguity) లేకుండా అత్యంత సరళంగా, సహజంగా రాసే శైలినే ఎన్నుకున్నాను. తెలంగాణ భాషలో, చెప్పే విధానంలో, మాట్లాడే 'తరీఖా'లో కథనశైలి (Narrative Style) ప్రధానాంశంగా ఉంటుంది. విషయాన్ని సూటిగా చెప్పడం, సందర్భాన్ని బట్టి వివిధ భావోద్వేగాలతో చెప్పడం, ఆర్తిగా, ఉగ్రంగా, దయతో చెప్పడం, ఎవరో ఒకరిని ఉద్దేశించి చెప్తున్నట్లుగా 'సంభాషణా శైలి'తో చెప్పడం తెలంగాణా రీతి... రివాజు! ఇది తెలంగాణా కథా, కథన, కవిత్వ ఆత్మ. అందుకే నేను కూడా ఆ 'ఆత్మగల్లతనాన్ని' నా కవితలలో ప్రతిష్టించడాన్ని సహజంగా చేసాను.

తెలంగాణ భాషలో 1995 నుండి ప్రస్తుతం వరకు నేను రాసిన కవితలలో ఎంపిక చేసిన కవితలతో ఈ 'ఊరికిపోయిన యాళ్ళ'ను ప్రచురించాను. దీని ద్వారా ప్రజల భాషకు, సామాన్య ప్రజల ఆకాంక్షలకు శనార్తులు తెలియజేయడమే నా అభిలాష. ఈ కవితల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, దానిలోని వైవిధ్యతను, ఉద్యమ కాలపు ఉద్వేగాలను, మట్టి-మనిషి బంధాలను మొత్తంగా తెలంగాణా అస్తిత్వాన్ని, ఆత్మను తెలంగాణ భాషలోనే తెలియజేసే ప్రయత్నం చేశాను.

"మా గోసను మేము చెప్పాలే" అనే దశ నుండి "మా గోసను మా బాసలోనే చెప్పాలె" అనే తర్వాత దశలోని స్పష్టమైన తండ్లాటకు ఈ సంకలనం ఓ సంకేతం.

– మామిడి హరికృష్ణ

# ఊరికి పోయిన యాళ్ళ...

మామిడి హరికృష్ణ

కవిత్వం

## The Poet

### MAMIDI HARIKRISHNA

Mamidi Harikrishna hails from Shayampet village in Warangal district of Telangana State. He is one of the prominent poets in contemporary Telugu Literature. A government employee by profession, he is a poet, painter, writer, translator, essayist, historian, film maker and film critic by predilection. He is influenced by the world literature as well as the world cinema.

His poetry tries to portray the two ends of human agony and ecstasy in their myriad forms. His style is deeply rooted in the local dialect and lifestyles with a blend of "native roots of naturalism" and changing times of "cosmopolitan ultra modernism". He is a double master graduate in Psychology and Education and his poetry tries to unravel and explore the unexplored plains of human psyche. He had a credit of publishing thousands of essays on various topics like art, culture, heritage, literature, cinema, behaviour etc. which are published in National and International papers and magazines.

He introduced "Fusion Shayaree:, a novel style of poetry writing in Telugu literature which gives scope and space to the multicultural and multilingual lives we live in contemporary society in literary format. He had edited more than 45 books in Telugu and in English, which are unique in their nature and substance.

He won the prestigious NANDI AWARDS FOR BEST FILM CRITICISM for the years 2009 & 2012, CINEGOER AWARD 2008 as BEST SCRIPT WRITER, INDYWOOD AWARD in 2018 for promotion of the art of cinema & short films.

*Presently he is the Director of the Department of Language and Culture, Government of Telangana State.*

## The Book


**OORIKI POYINA YAALLA...** (WHEN WE VISIT OUR HOME VILLAGE..), *is an anthology of selected poems written in Telangana language from 1995 to 2018, portrays the fairs, festivities, lifestyle on one hand and the transformation of Telangana country life at various phases of modernization, on the other.*

*The poems depict the struggles - sacrifices, pains - pleasures, confusions-commotions, conficts - conclusions of the people, their nostalgia and the alienation with their roots, inevitably happening due to the globalisation, technological advancement etc., from the point of view of a common man and in people's language. These are the impeccable expressions straight from the heart of a true Telanganite. Every line of these poems sincerely represents the emotions than euphemism, attachments than allegories, man-mud relations than metaphors.*

# ఊరికి పోయిన యాళ్ళ...

మామిడి హరికృష్ణ

కవిత్వం



స్వరాజ్యం పబ్లికేషన్స్
హైదరాబాద్

ఊరికి పోయిన యాళ్ళ...

తెలంగాణ భాషలో
మామిడి హరికృష్ణ కవిత్వం

**Oorikipoyina Yaalla...**
An anthology of poems in Telangana Language
by *Mamidi Harikrishna*

First published on 28th September, 2018
Price : Rs. 200/-

Copies : 1000
ISBN : 978-93-5416-515-3

Cover painting by :
***Aeley Laxman***

Published by & for Copies :
**Swarajyam Publications**
***Mamidi Jayakrishna***

# 804, Royal Pavilion Apartments,
Opp. Big Bazaar, Beside RBI Quarters,
Ameerpet, Hyderabad.
E-mail: Harikrishnamango3@gmail.com
*& All leading bookshops.*

Printed at :
***Sai Likhita Printers***
Khairatabad, Hyderabad - 500 004. Tel: 7207045979

---

© The poet
*No Part of this book may be reproduced without the prior permission of the poet.*

# అంకితం



అమ్మ

శ్రీమతి **మామిడి స్వరాజ్యం**కు

తన కొనసాగింపుగా

నన్ను

ఈ లోకానికి ఇచ్చినందుకు...

**– మామిడి హరికృష్ణ**

**మామిడి జయకృష్ణ**

# ధన్యవాదాలు...

**అమ్మ** కీ॥శే॥ మామిడి స్వరాజ్యం

**నాన్న** డా॥ మామిడి సుదర్శన్

**తమ్ముడు** మామిడి జయకృష్ణ

**చెల్లెళ్ళు – బావలు – పిల్లలు**
కందకట్ల స్రవంతి – జనార్ధన్ – గౌతమ్, హిమేశ్
మాసాని స్వాతి – రాజేంద్రప్రసాద్ – హరిణి
బాసాని సుకృతి – పవన్ కుమార్ – సుదీప్‌శంకర్

**బాబాయిలు – చిన్నమ్మలు**
మామిడి సుధాకర్ – సరోజన – రచన–నివేదిత
మామిడి సురేందర్ – రాజమణి – రంజిత్–రాకేష్
మామిడి అశోక్ – రాజేశ్వరి – అరుణ్‌రాజా, అనూరాధ, అనూష

**అత్తమ్మలు – మామయ్యలు**
కీ.శే. దాసి మల్లికాంబ – కీ.శే. శ్రీహరి
కందగట్ల సుగుణ – కీ.శే. డా॥ చంద్రమౌళి
శిరుమళ్ళ శాంత – గోవర్ధన్
కీ.శే. బండారి సరోజని – కీ.శే. కుమారస్వామి

**పెద్దమ్మ – పెదబాపు కుటుంబం**
కీ.శే. గుర్రం విమల – కీ.శే. ముత్తిలింగం
గుర్రం సురేష్ – నిర్మల, శ్యాంబాబు – పద్మ
డా॥ రమేష్ – వీణ, సబ్బని సరస్వతి – రాజేందర్
బొద్దుల మల్లయ్య – రమ, బలభద్రుల ఉమాదేవి – కృష్ణమూర్తి


**ఆత్మీయులు**
అయినంపూడి సరోజిని – శ్యాంసుందర్‌రావు
శ్రీలక్ష్మి – నాగేశ్వరరావు, నవ్యత–యశ్, హర్షిత–అభినవ్
చంద్రశేఖర్ – సుధ, సుబ్బారావు – బిందు
మహేశ్వర్ – మాధవి.

**– మామిడి హరికృష్ణ**

# మట్టి భాషకు శనార్తి!

Human History and Science & Technology have jointly evolved together adding the other factor i.e., Language. The language has become an instrument in recording, documenting and preserving every experience of humankind and making them as a reference, by which the following generations have learnt many things and tried to find new awareness and new vistas, leaving the earlier experiments. Thus, language, either in the form of oral or written traditions, had contributed a lot to the Human kind to save the time, which in turn accelerated the growth and development of civilisation in a short span of 6000 or so years!

మనిషి పరిణామంలోని తొలిదశలలో సంభవించిన కొన్ని ఆవిష్కరణలు, ఆ తర్వాత మొత్తం మానవజాతి పురోగతికే ఆలంబనగా నిలిచాయనేది సత్యం. వాటిలో నిప్పును, చక్రాన్ని, వ్యవసాయాన్ని, భాషను కనుక్కోవడం అనే నాలుగు అంశాలు తదనంతర కాలపు మానవనాగరికత సౌధానికి నాలుగు మూలస్థంభాలుగా నిలిచాయని చెప్పాలి. అయితే ఆదిమకాలంనాటి భాష, మనం ఇప్పుడు చూస్తున్నంత, మాట్లాడుతున్నంత, వింటున్నంత, రాస్తున్నంత వృద్ధి చెందిన దశలో లేనప్పటికీ, భాష ప్రాథమిక లక్ష్యమైన సమాచారాలు, అభిప్రాయాలు, ఇష్టాలు, అయిష్టాల వ్యక్తీకరణకు ఆనాటి అవసరాలకు



సరిపోయేంత ఉందనేది మాత్రం కాదనలేని సత్యం. అలాగే తొలినాటి భాష, మానవుడు తనతోటి మానవులకు, సమూహానికి అర్థం అయ్యేలా Communicate చేయదగ్గ స్థాయిలో ఉందనేది కూడా నిజం.

ఒక భౌగోళిక నైసర్గిక భూభాగంలో స్థిరనివాసం ఉంటున్న ప్రజల మధ్య సమాచారాల చేరవేత, అభిప్రాయాల ఆదానప్రదానాలకు, వివిధ ధ్వనులు సంకేతాలతో కూడిన వ్యక్తీకరణ సాధనమే భాష! (Language is the Medium of Expression made up of certain sounds and Symbols).


అయితే భాష గతిశీలి (Dynamic)! ఎప్పటికప్పుడు, ఆయా సమాజాలు, వ్యక్తుల అవసరాలను అనుసరించి నిరంతరం పరివర్తనం (Transformation) చెందుతూ ఉండటమే కాక, ఆయా సమాజాల ఆలోచనలను 'పరావర్తనం' (Reflection of the thoughts of the society) చెందిస్తూ ఉంటుంది. అలాగే ఆదిమకాలం నుంచి అత్యాధునిక కాలందాకా మనిషి ఎన్ని పరిణామాలు చెందాడో, అంతే పరిణామ దశలను భాష కూడా దాటుకుంటూ వచ్చింది. అందుకే Noam Chomsky వంటి Psycholinguists దృష్టిలో "మానవ చరిత్ర అంటే భాషా పరిణామ వికాస చరిత్రే!" (Human History in other words, is nothing but the History of Language itself.)

ఇలా భాష, మానవ నాగరికతను, వికాసాన్ని వేగవంతం చేయడంలో కీలకమైన పాత్ర పోషించినప్పటికీ, మొదట్నించీ భాష రెండు రకాల రూపాలను సమాంతరంగా ప్రదర్శిస్తూ వస్తూందనేది గమనించాలి. ఒకటేమో పాలకవర్గం, వారి చుట్టూ ఉండే మేధోగతజీవులు మాట్లాడే భాష! రెండోది ఉత్పత్తి కార్యకలాపాలలో పాల్గొనే శ్రామికులు, సామాన్యులు నిత్య వ్యవహారంలో మాట్లాడే భాష!! కాలక్రమంలో ఇది మార్గ, దేశి సంప్రదాయాలుగా భాషా వ్యవహారంలో స్థిరపడ్డాయి. మరో మాటల్లో చెప్పాలంటే, ఒకే భాష పండిత (Scholars language) భాష, పామర భాషగా (Commons language) రెండు రూపాలలో సమాంతరంగా కొనసాగుతూ వచ్చింది. అదే సమయంలో ఆయా భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు, వాటిని అనుసరించి రూపొందిన వృత్తులు, ఉత్పత్తిక్రియలలోంచి పుట్టిన ప్రత్యేక పదాలు (Jargon), క్రియావాక్యాలు ఒకే భాషలో వైవిధ్యత (diversity)కు, భాషా పరంగా ప్రాంతీయ తారతమ్యాలకు (Regional Differences) కారణభూతం అయ్యాయి. ఇలా రూపొందినవే మాండలికాలు (Dialects)!

ఇక తెలుగు భాష విషయానికొస్తే ఇందులో మనకు (3) పాయలు కనిపిస్తాయి. 1) మార్గ సంప్రదాయంలోని పండిత, పుస్తక భాష; 2) దేశి సంప్రదాయంలోని పామర, నిత్య జీవన భాష, 3) మాండలిక భాష.

తెలుగు భాషలో ఈ 3 ధోరణుల పరిణామ విశేషాలను ఇలా వివరించవచ్చు.

- మొదట్లో అంటే క్రీ.శ. 9వ శతాబ్దంలో సంస్కృతభాషను మేళవించిన పదాలు, వాక్యనిర్మాణం, వ్యాకరణంతో ఉన్న తెలుగు భాష కవులు, పండితుల భాషగా, మార్గసంప్రదాయంలో ఉండగా, ఆకాలంలో సామాన్య ప్రజల భాష తెలుగుగా ఉండింది. దీనినే ఆ తర్వాత "దేశి సంప్రదాయం" అనీ, పాల్కురికి సోమన లాంటి కవులు అచ్చతెనుగు, జానుతెనుగు అని అన్నారు.
- 15వ శతాబ్దం నాటి ప్రబంధకాలం నుండి 19వ శతాబ్దం వరకూ పండిత భాషగా గ్రాంథిక భాష, పామర భాషగా వ్యవహారిక భాషలు సమాంతరంగా ప్రయాణిస్తూ వచ్చాయి.
- ఈ వ్యవహారిక భాషలోనే ఆయా ప్రాంతాలు, మండలాలలోని వృత్తులు, భౌగోళిక నేపథ్యాల ఆధారంగా ఏర్పడిన పదాలు, సమాసాలు, జాతీయాలు (Idioms), సామెతల (Proverbs)తో రూపొందిన భాష మాండలిక భాష (Dialect)గా ఏర్పడి, తెలుగు భాషలోనే మూడోపాయగా ఎదిగింది. ఈ మాండలికాలు ఉత్తరాంధ్ర, రాయలసీమ, గోదావరి కృష్ణా, కోస్తాంధ్ర, తెలంగాణలుగా తమదైన స్థానికత (Local Nativity)తో ప్రత్యేక యాసను, ఉచ్ఛారణను సాధించాయి.
- ఆయా ప్రాంతాలలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా మనిషి దేహంలో రూపొందిన స్వరపేటిక, ఉచ్ఛారణపరమైన అంశాలతోపాటు స్థానిక సంప్రదాయాలు (Traditions), ఆచారం (rituals), సంస్కృతి (Culture), కట్టుబాట్లు, నమ్మకాలు, విశ్వాసాలు (Faith), పండుగలు (Festivals), జాతరలు (Fairs), ఆహారపుటలవాట్లు (Food Habits), పంటతీరు (Crop Pattern), వృత్తులు (Occupations), చేతివృత్తులు (Handicrafts) అన్నీ ఆయా ప్రాంతాలలో ప్రత్యేకమై ఉండి, ఇతర ప్రాంతాలతో భిన్నత్వాన్ని సాధించాయి. దానికి అనుగుణమైన పదాల నిర్మాణంతో రూపొందిన భాషే మాండలికాలుగా ప్రత్యేకతను సాధించాయి.



## 2

చారిత్రకంగా, భాషా పరిణామపరంగా గమనిస్తే, నిజానికి తెలుగు భాషలో అంతర్భాగంగా ఉన్నవన్నీ ప్రధానంగా మాండలికాలే. ఐనప్పటికీ, కోస్తాంధ్ర తెలుగు భాషను ప్రామాణిక భాష (Standard langugage) గా వ్యాప్తిచేస్తూ, ఇతర తెలుగు మాండలిక భాషలు న్యూనీకరించబడిన (degradation) సంఘటనలు 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదలయ్యాయి. ఈ క్రమంలో చాలావరకు అపహాస్యానికి గురైన భాష తెలంగాణా మాండలికం. 1956 నుండి 2006 వరకు దాదాపు 50 ఏళ్ళకాలం పాటు తెలంగాణా పదాలు, భాష మాట్లాడటం హేళనకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. దానివల్ల చాలామంది తెలంగాణ బిడ్డలు తమ మట్టి భాషను త్యజించి (Disown), ప్రామాణిక భాషగా చలామణి అవుతున్న కోస్తాంధ్ర తెలుగు యాసను, శైలిని అనుకరించేంతగా సామాజిక ఒత్తిడి (Social Pressure) పెరిగింది. అదే అణచివేత (Suppression), వివక్ష (Discrimination) చివరికి తెలంగాణ భాష సంస్కృతుల అస్తిత్వ (Existence) సమస్యగా, ఆత్మగౌరవ (Self respect) అంశంగా పరిణమించాయి.

అయితే, తొలిదశ తెలంగాణా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైన 1969 నాటికి సాహితీ, సాంస్కృతిక రంగాలలో తెలంగాణ భాషలో కవిత్వం, కథ, నవల వంటి ప్రక్రియలలో సృజన విస్తృతంగా ప్రారంభమయింది. అలా పూర్తిగా తెలంగాణా మాండలికంలోనే 'ఇచ్ఛంత్రం' కవితా సంకలనం, దేవరాజు మహారాజు రాసిన 'గుడిసెగుండె' వంటి కవితా సంకలనాలు వెలువడ్డాయి. ఈ ధోరణి ఆ తర్వాత కూడా అలానే కొనసాగి, తెలుగు సాహిత్యంలో తెలంగాణా మాండలిక సాహిత్యం ఒక విశిష్ట శైలి (Special Style) గా ఎదిగింది.

ఇక 2000 సంవత్సరం తర్వాత మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిన తర్వాత తెలంగాణా భాషలో సాహిత్యం, కవిత్వం మరింత పదునెక్కింది. కోస్తాంధ్ర తెలుగు నుంచి తెలంగాణా తెలుగుకున్న విభిన్నతను చెప్పడం కోసం మాట, పాట, రచన, కైత అన్నీ తెలంగాణా భాషలోనే చేయడం ఆమోదనీయతను (Acceptability) సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లోని సమైక్యరాష్ట్ర భావనపై ధిక్కార సూచికగా (Symbol of contempt) 'నిరసన

కేతనం' (Expression of Dissent) గా తెలంగాణ భాషను తెలంగాణా సాహితీవేత్తలు రాయడం మొదలెట్టి తమ ప్రత్యేక రాష్ట్ర సాధనాకాంక్షను బలంగా వినిపించారు. తెలంగాణ భాషలో తెలంగాణ నుడికారాలు, సామెతలు, జాతీయాలతో కూడిన ప్రసంగాలు, పాటలు, కథలు, కవితలు ప్రజలను ఉర్రూతలూగించాయి. తెలంగాణా ప్రజలలో సంఘటితత్వాన్ని, ఏకత్వ స్ఫూర్తిని రగిలించాయి.

ఇలా తెలంగాణా భాషను ఒక భావవిప్లవ ఆయుధం(Ideological weapon)గా వాడి ప్రజలందరిలో గొప్ప చైతన్యాన్ని తీసుకొచ్చిన ఘనత మాత్రం ఉద్యమనేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు** గారికే దక్కుతుంది! తెలంగాణ భాషలోని సొబగును, సహజత్వాన్ని ఆయన ఉపయోగించిన తీరు తెలంగాణ భాష విషయంలో ఆంధ్రప్రాంత తెలుగు వారి నుండి ఎదురైన వివక్ష (Discrimination)ను న్యూనీకరణ (Degradation)ను పటాపంచలు చేసింది. భాష విషయంలో తెలంగాణా ప్రజల ఆత్మగౌరవాన్ని ఆకాశమంత ఎత్తుకు పెంచింది.

## 3

చారిత్రకంగా, నైసర్గికంగా, భౌగోళికంగా, శీతోష్ణస్థితి పరంగా తెలంగాణా విశిష్ట లక్షణాలను సంతరించుకుని ఉన్నది. బౌద్ధ, జైన మతాలకు నెలవుగా, శాతవాహనులకు, కాకతీయులకు కొలువుగా, కుతుబ్‌షాహీలు, ఆసఫ్‌జాహీలకు, సంస్థాన పాలకులకు ఆదరువుగా తెలంగాణ ప్రాంతం అత్యున్నత వైభవాన్ని, విజయాల్ని సాధించింది!

ఇలా తెలంగాణా ప్రాంతానికి ఉన్న మహోన్నత నేపథ్యమే నాలాంటి వారికి నిరంతర స్ఫూర్తిగా నిలుస్తూ వచ్చింది. ఒక నిత్య చైతన్య దీప్తిగా వెలుగులిస్తూ వచ్చింది. నేను వరంగల్ జిల్లాలోని శాయంపేట గ్రామంలో జన్మించడం వల్ల, మా ఊరు 'తెలంగాణా జలియన్‌వాలాభాగ్' అయిన పరకాలకు సమీపంలో ఉండటంవల్ల మొదట్నించీ నాలో తెలంగాణా సోయి కొంచెం ఎక్కువగానే ఉండేది. దానికి తగ్గట్టు నా విద్యార్థి రోజుల్లో అంటే 1985 నుండి 96 ప్రాంతాలలో ప్రపంచ సాహిత్యాన్ని ఎంత ఇష్టంగా చదివేవాణ్ణో, తెలంగాణ మాండలికంలో వచ్చిన కథలు, కవితలు, సాహిత్యంను కూడా అంతే '*పావురం*తోని చదివేవాణ్ణి. దీనివల్ల నాకు మొదట్నుంచీ Global



చూపునీ, Local హృదయాన్నీ రెండింటినీ సమన్వయం చేసుకునే పరిజ్ఞానం ఒనగూడింది.

దీనివల్ల 1993 ప్రాంతంలోనే అంటే నేను ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ. సైకాలజీలో చేరిన రోజుల్లోనే తెలంగాణ భాషలో కవిత్వం, కథలు రాయడం, ఇతర రచనలు చేయడం షురువయింది. అప్పటి సంది, ఏదో ఒక సందర్భంలో నేను తెలంగాణా భాషలో కవిత్వం రాస్తూనే ఉన్నా! నన్ను ఆలోచింపచేసిన, నన్ను స్పందింప చేసిన అంశాలు, సంఘటనలు, వస్తువుల మీద తెలంగాణ కవితలు ఎన్నో రాసాను. తెలంగాణ భాష, తెలంగాణ ప్రజాజీవనం ఎంత సులభంగా, సుళువుగా, సరళంగా ఉంటుందో అంతే సాదాసీదాతనం నా కవిత్వంలో ప్రతిబింబించాను. ఆ ఉద్దేశంతోనే కవిత్వంలో సంక్లిష్టత (Complexity), సందిగ్ధత (Ambiguity) లేకుండా అత్యంత సరళంగా, సహజంగా రాసే శైలినే ఎన్నుకున్నాను.

తెలంగాణ భాషలో, చెప్పే విధానంలో, మాట్లాడే 'తరీఖా'లో కథనశైలి (Narrative style) ప్రధానాంశంగా ఉంటుంది. విషయాన్ని సూటిగా చెప్పడం, సందర్భాన్ని బట్టి వివిధ భావోద్వేగాలతో చెప్పడం, ఆర్తిగా, ఆవేశంగా, ఉగ్రంగా, దయతో చెప్పడం, ఎవరో ఒకరిని ఉద్దేశించి చెప్తున్నట్లుగా 'సంభాషణా శైలి'తో చెప్పడం తెలంగాణా రీతి...రివాజు!

ఇది తెలంగాణా కథా, కథన, కవిత్వ ఆత్మ!

అందుకే నేను కూడా ఆ 'ఆత్మగల్లతనాన్ని' నా కవితలలో ప్రతిష్ఠించడాన్ని సహజంగా చేసాను.

అయితే, తెలంగాణా భాషలో నేను వందలాది కవితలు రాసినప్పటికీ, వాటిలో ప్రచురితమైనవాటికన్నా, పత్రికా సంస్థల నుంచి తిరస్కరించబడినవే ఎక్కువ. 1996 నుండి 2006 వరకు నాటి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న భావజాలం వల్ల ఇది జరిగి ఉండవచ్చు. లేదా మరేదైనా కారణం కావచ్చు. అయినా నా బాసను అక్షరాల్లో చూపించాలి. నా తెలంగాణ ప్రత్యేక నుడికారాన్ని ప్రపంచానికి నేను కూడా తెలియజేయాలి అనే ప్రగాఢ కాంక్షనే, నన్ను తెలంగాణ మాండలికంలో కవిత్వం రాసేలా ప్రేరేపించింది.

ఈ నేపథ్యంలోంచే, అప్పట్లో ఉండే తెలంగాణా పట్ల వివక్షకు

వ్యతిరేకంగా తెలంగాణా కవిత్వాన్ని ఒక్కచోట కూర్చాలనే లక్ష్యంతో, కవి సుంకర రమేష్ చొరవతో నేను, అన్వర్ ముగ్గురం సంపాదకులుగా "తెలంగాణ కవిత 2006" పేరుతో తెలంగాణా వార్షిక కవితా సంకలనాన్ని ప్రచురించాము. బహుశా మలి తెలంగాణా ఉద్యమకాలంలో వచ్చిన తెలంగాణా సమకాలీన కవుల తొలి వార్షిక కవితా సంకలనం ఇదేనేమో! ఆనాడు ఉన్న రాజకీయ, సాహితీ వాతావరణంలో ఈ సంకలనాన్ని తీసుకురావడం ఒక గొప్ప సవాలే!


ఇలా సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ప్రత్యేక గొంతును వినిపించాలని బలంగా కోరుకున్న నేను, నా భావాలను ఆలోచనలను తెలంగాణ భాషలో రాసే రచనలు, కవితల ద్వారా వ్యక్తం చేసుకుంటూనే వచ్చాను.

అలా తెలంగాణ భాషలో నేను 1995 నుండి ప్రస్తుతం వరకు రాసిన కవితలలో ఎంపిక చేసిన కవితలతో ఈ "ఊరికిపోయిన యాళ్ళ'ను ప్రచురించాలని భావించాను. దీని ద్వారా ప్రజల భాషకు, సామాన్య ప్రజల ఆకాంక్షలకు శనార్తులు తెలియజేయాలని అనుకున్నాను. ఈ కవితల ద్వారా తెలంగాణ గ్రామీణ జీవితాన్ని, దానిలోని వైవిధ్యతను, ఉద్యమ కాలపు ఉద్వేగాలను, మట్టి–మనిషి బంధాలను మొత్తంగా తెలంగాణా అస్తిత్వాన్ని, ఆత్మను తెలంగాణ భాషలోనే తెలియజేసే ప్రయత్నం చేశాను. *"మా గోసను మేము చెప్పాలే"* అనే దశ నుండి *"మా గోసను మా బాసలోనే చెప్పాలె"* అనే తర్వాత దశలోని స్పష్టమైన తండ్లాటకు ఈ సంకలనం ఓ సంకేతంగా ఉండాలని అనుకున్నాను.

అలాగే ఈ కవితల వరుసను, తేదీలవారీగా కాకుండా, ఇంగ్లీష్ 'A'కారాది క్రమం (Alphabetical Order)ను అనుసరించి అమర్చాను.

మరోవైపున, 2014 జూన్ 2న తెలంగాణా రాష్ట్ర అవతరణ తర్వాత భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడిగా బాధ్యతలు నిర్వర్తించే అదృష్టం, అవకాశం నాకు తెలంగాణా ప్రభుత్వం అందించింది.

అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ ముందు వరకూ తెలంగాణ భాషను, తెలంగాణ మాండలికంగా పిలవడం, పరిశీలించడం చూసాం. ఇక ఇప్పుడు తెలంగాణ మాండలికంగా కాకుండా ఒక భాషగా అందరూ గమనించాలనే



లక్ష్యంతో భాషా సాంస్కృతికశాఖ పక్షాన 2014 సంవత్సరంలో నేను ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించే అవకాశం కలిగింది. దానిని అనుసరించి గౌరవ ముఖ్యమంత్రి **శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు** గారి ఆదేశాలతో తెలంగాణా పలుకుబడుల గౌరవ పతాక, ప్రజా కవి శ్రీ కాళోజీ నారాయణరావు గారి జయం2తి అయిన సెప్టెంబర్ 9 తేదీని **'తెలంగాణ భాషా దినోత్సవం'**గా జి.ఓ.ఆర్టీ సంఖ్య.67 యువజనాభ్యుదయ, పర్యాటక & సాంస్కృతిక (సాం.వ్య) శాఖ, తేది. 10`09`2014 ద్వారా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇలా యాసగా, మాండలికంగా మాత్రమే గుర్తింపు పొందిన తెలంగాణా పలుకు కాస్తా 'భాష'గా ప్రజాప్రభుత్వ ఆమోదాన్ని పొందింది. ఈ మొత్తం అధికారిక ప్రకటన అనే ప్రక్రియలో నాకు క్రియాశీల పాత్ర (అంటే తెలంగాణా భాషా దినోత్సవ ప్రతిపాదన నుంచి ప్రభుత్వ ఉత్తర్వు ప్రకటన వరకు) లభించడం నా పూర్వజన్మ సుకృతంగానే భావిస్తాను.

ఈ ప్రస్థానమే నన్ను మా అమ్మ 20వ సంవత్సరీకం రోజున తెలంగాణా భాషలో నేను రాసిన ఈ 'ఊరికిపోయిన యాళ్ళ' కవితా సంకలనాన్ని ప్రచురించడానికి ప్రేరణను ఇచ్చింది.

ఇక తెలంగాణా మాట, పదం, వాక్యం, ఇకముందు యాసనో, మాండలికమో కాదు 'పరిపూర్ణ భాష' అని మరొక్కసారి కవితాపరంగా చెప్పడానికి, చూపడానికి, ఈ సంకలనం ఏ కొంచెం దోహదపడినా నా ఆశయం నెరవేరినట్లేనని భావిస్తూ...

అందరికీ శనార్తులతో ...

మీ

సెప్టెంబర్ 2018 **మామిడి హరికృష్ణ**

తెలంగాణా ప్రభుత్వము
సంక్షిప్తి

యు.ప & సాం.వ్య. శాఖ - ప్రజాకవి కాళోజి నారాయణ రావు జన్మదినం సెప్టెంబర్, 9 వ తేదిని "తెలంగాణా భాషా దినోత్సవం"గా ప్రకటన - ఉత్తర్వులు - జారీ.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

యువజనాభ్యుదయ, పర్యాటక & సాంస్కృతిక(సాం.వ్య) శాఖ

జి.ఒ.ఆర్టి సంఖ్య : 67 తేది : 10/ 9/2014.

****

ఉత్తర్వు :

ప్రజాకవి కాళోజి నారాయణ రావు గారి జన్మదినమైన సెప్టెంబర్, 9 వ తేదిని ప్రతి ఏడాది "తెలంగాణా భాషా దినోత్సవం"గా జరుపుటకై ప్రభుత్వం నిర్ణయించినది.

2. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఈ విషయంలో తగు చర్యలు తీసుకోగలరు.

(తెలంగాణ రాష్ట్ర గవర్నరుగారి ఉత్తర్వుల మేరకు వారి పేరు మీదుగా జారీ చేయడమైనది)

బి.పి.ఆచార్య,
ముఖ్య కార్యదర్శి( ప & సాం)


సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ.
తెలంగాణా రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లందరికి.
ప్రతులు :
తెలంగాణా రాష్ట్ర సచివాలయంలోని అన్ని శాఖలకి
వ్య.కా. ముఖ్యమంత్రిగారి అదనపు కార్యదర్శి.

// ఉత్తర్వుల మేరకు పంపడమైనది //

విభాగాధికారిణి.

*Two roads diverged in a wood,*
*and I took the one less travelled by,*
*And that has made all the difference.*

- Robert Frost
*"The Road Not Taken"*
(From Mountain Interval 1916)



# తొవ్వ ఇదీ....


1. అమ్మ చెప్పిన ఖాందాని కత 19

2. బుగులోని తీర్థం 22

3. బోనం సాక 31

4. చత్తిరి 35

5. చెరుకు బాయి 41

6. దారం కట్టిన సందమామ 45

7. దోని నీళ్ళు 50

8. E - 1, రూమ్ నెంబర్ 70... 54

9. Fusion షాయరీ on తెలంగాణా జమీన్ 57

10. గుట్టను పగలేసినం 61

11. ఇనుప కంచె... అడ్డుగోడ... ఒక జన జాతర! 67

12. జెండాగా ఎగిరిన అచ్చరం 70

13. కొత్త సాలు ముచ్చట 73
14. కట్ట మీద రాల చెట్టు! 76
15. మట్టి చెక్కిన శిల్పం 79
16 మా ఊరి పురాణం 83
17. మావోన్ని మాయం సేసినంక 88
18. Occupy హైదరాబాద్ 91
19. ఊరికి పోయిన యాళ్ల .... 96
20. ఊరు బతక బోతాంది 100
21. పండుగ 105
22. పచ్చడి, బచ్చం... మా బంగ్లా... 109
23. పట్నం పెద్దమ్మ అసొంటిది 112
24. పిట్టని దేవులాడిన గూడు 114
25. సలి మంట 118
26. సాపేక్షత 122
27. సీత కుంట 126
28. తంగేడు పూల నేల 131
29. వానెల్సినంక 135
30. 'యాకుత్ పురా'ణ శకలం 140



# 1

# అమ్మ చెప్పిన ఖాందాని కత

ఇది నా చిన్ననాడు
బడికి సాగ దోలేటపుడు
మా అమ్మ చెప్పింది!

అంగి తొడుక్కుంట చెప్పింది–
*'కొడ్కా! బల్లె మంచిగుండు*
*మంచిగా సదువు*
*నువ్వు మంచిగుంటే మంచి పేరత్తది!'*

నెక్కర్ తొడుక్కుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు మంచి పని చేత్తే*
*ఊల్లోల్లు అందరు*
*గా డాక్టర్ సాబ్ కొడ్కు మంచి పిలగాడు అంటరు!'*

చేతులకు నూనె రాసుకుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు మంచి పనిచేత్తే*
*గా శాలోల్ల పిలగాడు మంచోడు అంటరు !'*

In-shirt ఏసుకుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు వరంగల్ కు పోయినంక*
*అక్కడ మంచి పనిచేత్తే*
*గా ఊరోడు మంచి పోరగాడు అంటరు!'*

Belt పెట్టి Tie కట్టుకుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు హైదరబాదల మంచి పనిచేత్తే*
*గా వరంగల్ జిల్లోడు మంచోడు అంటరు!'*

బాల్ దువ్వి Powder ఏసుకుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు ఢిల్లీల మంచిపని చేత్తే*
*గా తెలుగోడు మంచోడు అంటరు!'*

కాళ్లకు Socks లేసి బూట్లేసి లేసులు కట్టుకుంట చెప్పింది
*'కొడ్కా! నువ్వు అమెరికల మంచి పని చేత్తే*
*గా భారద్దేశపోడు మంచోడు అంటరు!'*

బుజాలకు పుస్తకాల సంచి యేసుకుంట చెప్పింది–
*'కొడ్కా! నువ్వు ఎక్కడికి పోతే అక్కడికి నువ్వొక్కనివే పోవు*
*నీకు కనిపించకుంట*
*నీ బుజాల మీన కూసోని*
*నీ తోనే వత్తయి*
*నీ ఇంటి పేరు... నీ కుటుంబ పరువు...*
*నువ్వెక్కడికి పోతే అక్కడికి*
*నీ ఎనక పొంటే వత్తది*
*నీ ఏడేడు తరాల చరిత్ర*
*ఒక్కొక్క పాలి నీకు తెల్వకుంటనె*
*నీకన్న ముందుగాల్నే*
*నువ్వు పొయ్యే కాడికి పొయి కూసుంటై*
*మంచి చెడ్డలు పురాగ నియ్యే*
*కానీ గవి నీ ఖాందాన్‌కు సుతం సుట్టుకుంటయి.......'*

ఇంకేమన్న చెప్పటానికి ఇప్పుడు అమ్మ లేదు
కనీ, నా బతుకంతా అమ్మ మాటే నిండిపోయింది...!

***(25 సెప్టెంబర్ 2003 – అమ్మ 5వ సంవత్సరీకం రోజు)***

# 2

## బుగులోని తీర్థం

1. మా ముత్తాత మా తాతకు
మా తాత, మా నాయ్నకు కశికెడు పాలతో నేర్పిచ్చిన రివాజు
దేవుడి ముచ్చట మతిలకు ఎక్కించిన మొదటి ఆవాజు
బుగులెంకటేశుని తీర్థానికి బైలెళ్ళిన రోజు

తరతరాల మా నమ్మకం
ఒక తంతెనుండి ఇంకో తంతెకు ఆచారం లెక్క వచ్చింది
రెండువేల గడపలున్న ఊళ్ళే
మా ఇంటికి బౌబాగపేరు తెచ్చింది

నెలకొక్క పున్నమి పొడుపు మామూలే
కానీ జంజిరాల పున్నమి అంటేనే పెద్ద ముచ్చట
అప్పుడే యాటకొక్కపాలి బుగులోని తీర్థం జర్గుతది

ఊరికి ఉత్తరం దిక్కున 30 మైళ్ళ అవతల బుగులోని తీర్థం–
తుమ్మలు–తుప్పలు, రేగుచెట్లు, పరికి పండ్లు, బలుసు పండ్ల చెట్లు
స్వేచ్ఛగా పెరిగిన చిన్న అడవి
ఆ అడవి నడుమల పెద్ద గుట్ట
ఆ గుట్టపైన సొరికెల నెరిసిన దేవుడు
మా ఇంటిదేవుడు బుగులెంకటేశ్వరుడు!

2. గప్పట్ల–
బుగులోని తీర్థం పోవుడంటే ఓ కాశీ మజిలీ యాత్రకు పోయినట్టే
ఇంటి పండుగను ఊళ్ళన్ని తిర్గుకుంట చేస్కున్నట్టే!
అన్నట్టు తీర్థం పోవుడంటే
భద్ర జీవునిలో నిక్షిప్తమైన దేశదిమ్మరితనం పురావాసనే కదా...
*Indeed, it's a Nomadic Vestige*
*The Revisting of instinctual Spiritualism*
*The manifestation of primate naturalism*
*The resurfacing of hidden originalism!*

తీర్థం పోవుడంటే–
భక్తి–రక్తి మిళాయించిన
ఓ ప్రయాణ పండుగ!
ఆత్మను ఎనుకులాడుకుంట అడుగులేసే జిప్సీ జీవనం!
సామూహిక సంచార ఉత్సవం!
తొలి మానవుడి జన్యు సహజాతాల ప్రదర్శనం!

తీర్థం పోవుడంటే–
అనాది కాలంల మొదలై
అర్ధాంతరంగా ఆగిపోయిన ఆదిమయాత్రను కొనసాగించడమే కదా!

3. ఇగ బుగులోని తీర్థం పోవుడంటే
మా ఇంట్ల ఓ పెండ్లి చేసినట్టే
ఏరువాక దున్నినట్టే
నెల రోజుల ముందుగాల సందే హైరానా శురువయ్యేది
ఊరూర్ల ఉన్న బందుగులందరికీ మతలాబు చెయ్యాలే
దానికోసం ఓ మనిషిని పంపియ్యాలె
బండ్లను వడ్లాయనతోని
బండిగీరెల కమ్మెలను కమ్మరాయనతోని పుదియ్యాలె
నీళ్ళతోని మంచిగ కడిగి
నొగలుకు, గీరెలకు పసుపు కుంకుమ బొట్లను పెట్టాలె
వెదురు బొంగులను వంచి బండి మీద గుడారం లెక్క చేసి
దానిపైన చెద్దరులను కట్టాలె!
మనుషులతో పాటు
గొర్రెలు, కోళ్ళు, కట్టెలు, వంటసామాన్లు సదురాలె!
ఇగ చూస్కో ఊరు ఊరే బండ్లమీద బైలెల్లినట్టు కనబడాలె!

మొత్తం రెండు రాత్రులు ఒక పగలు పోతె
బుగులోని జాతర!
మా ఊరు నుంచి మైలారం దాటి
కొప్పులకు పొయ్యేటాలకు చీకటి పడేది



అక్కడ మా తాత సుట్టాల ఇంట్ల రాత్రి విడిది
సంవత్సరానికొక్కసారి కలుత్తమని
బౌ పానంగ మర్యాదలు ... ముచ్చట్లు
రాత్రి బోయనాలు చేసి బైలెళ్ళేది

ఆకాశంల త్రయోదశి ఎన్నెల వెండి పూతల జిగేల్ జిగేల్...
మట్టిబాట మీద ఎద్దుల కాలిగిట్టల టకేల్ టకేల్
గంగడోలుల మీద గజ్జెల ఘల్‌ఘల్
బండిగీరెల కింద ఎండుకొమ్మలు విరిగిన చిట్‌పట్ చిట్‌పటల్...
బండిలోపల మనుషుల అచ్చట్లు ముచ్చట్లు
అన్నీ కలిసి ఎన్నెలరాత్రిని ఆరబోసిన గాలిల
వింతైన ధ్వనులను పరిమళిస్తుండేటియి
ముచ్చట్లల్ల ముచ్చట్లల్లనే
ఎడ్లు నడుత్తాంటె నడుత్తాంటెనే
బండ్లె కట్టేసిన కోడి కూత్తది
తూర్పు గట్లల్ల తెల్లవారుతది
బుగులోని గుట్టకాడికి
మా బండ్లు చేరుకుంటయ్!

4. ఓ చెట్టునో, గుట్ట నీడనో సూసుకొని
బండ్లను ఆపి ఎడ్లను ఇడిసి గడ్డి వేసి
విడిది ఏర్పాటు చేసుకుంటం....

మొకాలు, కాళ్ళు చేతులు కడుక్కొని
దేవుని గుండంల తానాలు జేత్తం
మూడు మునుగులు
మూడు చెంబుల నీళ్ళు
తలమీద గుమ్మరించుకొని
బట్టలు మార్చుకుని
నీళ్ళు కారుతున్న వెంట్రుకలతోనే
గుట్ట ఎక్కుడు షురూ జేత్తం
బండల సందులకెళ్ళి - సొరికెలల్లకెళ్ళి
బుగులెంకటేశుని గుహదగ్గరికి పోయి
దండాలు పెట్టి - కొబ్బరికాయలు కొట్టి
పసుపు కుంకుమల బొట్లు పెట్టి
మొక్కులు అప్పజెప్పుతం...
గుండె నిండ భక్తిని నింపుకుని
కండ్ల నిండ దేవున్ని సూసి
తప్పులు కాయమని చెంపలేసుకొని
వచ్చే ఏటికి అంతా మంచే చెయ్యమని
దేవునికి ముడుపులు కడతం!
పోయిన తొవ్వలనె
మళ్ళ గుట్ట దిగి వచ్చి
గుట్ట కింద గుడారం దుకాణాలల్ల
బత్తీసలు, నిమ్మ చిల్కలు, ప్యాలాలు, బెల్లం కొనుక్కొని
దేవుని పలారం అని మూటలు కడ్తం...

5. ఇగ, మా బాబాయ్‌లు -
విడిది కాడికచ్చి
దేవుని పేరుమీద మొక్కి పొట్టేల్‌ను, కోళ్ళను కోసి
ఆ నెత్తురును అందరికి బొట్ల లెక్క పెడ్తరు



జీతగాండ్లు కోడి బూరు పీకి – పొట్టేలు తోలు ఒలిచి
ముక్కల కింద కొట్టి దేనిది దానికి పోగులుపెడ్తరు
తలకాయ బొక్కలు – నెత్తురు – మాంసం–
దేనికదే కుప్పలు పెట్టి మంచిగ కడుగుతరు
బండలు ఏరుకచ్చి పొయ్యి పుదిచ్చి
కట్టెలు పెట్టి అగ్గి రాజేత్తరు

గప్పుడు ఇగ ఆడోళ్ళపని మొదలైతది.
బాపమ్మ, అమ్మ, చిన్నమ్మలు అంత కూడి
వాటన్నిటిని పెద్ద పెద్ద బాసాన్‌లల పెట్టి
మసాలా – గసాలాలు – పసుపు, కారాలు దట్టించి
పొయ్యిమీద గిన్నెలల్ల మరుగుతున్న నూనెల వేసి
ఘుమ ఘుమలాడే కూరలు చేత్తరు !

6. నేను చినపిలగాడ్ని గదా–
మెదడు – గుర్ధాలు – కప్పూరం – గుండె అసొంటి
మెత్తటి భాగాలు సూకాగ వండి సక్కగ పెడ్తరు.
వంటలన్నీ అయిపోయి, మంటలను చల్లార్చి
గిన్నెలల్ల కూరలన్ని పొగలు కక్కుతున్నపుడె
నన్ను ఎత్తుకుని మా అమ్మ గోరుముద్దలు పెట్టేటిది
తాత–నాయ్న–బాబాయ్‌లు–బంధువులు
మొగోళ్ళంత
బండ్ల పక్కన చెట్టు నీడల్ల బంతిలెక్క కూసొని
సారా బుడ్డీల మూతలను
పట్వలల్ల ఉండే కల్లు మీన ఈతాకులను తీసి
స్టీలు గ్లాసులల్ల వంచి – అందరికి పంచుతరు !

ఇగ ముచ్చట్లు మొదలైతై
తాత ముత్తాతలనాటి కతలు – ఇగురాలు – ఇకమతులు
అన్నీ యాది చేసుకుని మాట్లాడుకుంటరు
పల్లెంల ముక్కలను తినుకుంట, గ్లాసులల్ల సారా తాక్కుంట
ముచ్చట్లల్ల మునిగి తేలి
ఎప్పటికో బువ్వతిని ఎక్కడోళ్లక్కడ పండుకుంటరు!
ఇస్తాళ్ళు ఎత్తేసి, గిన్నెలు – తపేలాలు అన్నీ కడిగి
ఆడోళ్ళందరూ అన్నీ సదిరి
చాపల మీద నడుం వాలుస్తరు!

సూత్తాంటె సూత్తాంటెనే రాత్రయితది
పండు పగిలినట్లు పున్నమి ఎన్నెల ఇరగబూస్తది
అందరం ఒక్కచోట చేరినంక
పాటలన్ని అయిపోయినంక గా ఎన్నీలలనె బోయనాలు
మాటల్లు మాటలల్లనె మల్ల ముచ్చట్లు
అటెన్క మాతోటి వచ్చిన కూనపెల్లి రామయ్య
మార్కండేయపురాణం కథలు
కండ్లకు కట్టినట్టు కనికట్టు చేసినట్టు
కథాగానం మొదలు...
ఇనుకుంట ఇనుకుంటనే అక్కడే అందరి రాత్రి నిద్రలు!

7. పొద్దుగాల కోడి కూసే యాళ్ళకు
అందరు లేసి నోట్లె యాప పుల్లలు ఏసుకొని పండ్లు తోముకుంటరు
రాత్రి అన్నంనే పులిహోర లెక్క చేసి అందరికి పెడ్తరు



గుడాలు గిన్నెలల్ల పోసుకుని బండ్లెక్కి
ఊరి దిక్కు పయనం కడ్తరు
సడుగు మీద ఎనకపొంటి బుగులోని గుట్ట కనిపించే దాక

'గోవింద గోవింద' అని వెంకటేశ్వరుని తల్సుకుంట
ఇంటి మొకాన ఎడ్లను తోలుతరు
ఎక్కడ ఆగకుంట
మాపటి యాళ్ళకు ఊరికి–ఇండ్లల్లకు చేరుకుంటరు...!

ఆడోళ్ళంత మల్ల వంటలు చేసి
అందరికీ వడ్డించి ఎక్కడోళ్ళను అక్కడికి సాగ తోలుతరు
తెల్లారి పొద్దుగాల
అమ్మ – బాపమ్మ – చిన్నమ్మలు
నిష్టగ తలకు నీళ్ళు పోసుకుని, తానాలు చేసి
కొత్త చీరలు కట్టుకుంటరు

బుగులోని తీర్థం పలారాలను
పేపర్‌ల పొట్లాల లెక్క కడ్తరు.
ఊళ్ళే అందరి ఇండ్లల్లకు పోయి
ముత్తయిదుల కాళ్ళకు పసుపు రాసి

పలారం పొట్లాలను అందరికీ పంచుతరు...

8. గిట్ల బుగులోని తీర్థయాత్ర
మా తాత కాలం దాకా బౌ సక్కగ నడిసింది

మా తాత సచ్చిపోయిండు
వారసత్వంగా మా నాయ్నకు – బాబాయ్‌లకు
పొలాలు, భూములు, అన్నీ విరాసత్‌ల సంక్రమించినై
బంగారం – భవనాలు
ఎడ్లు – కొట్టాలు – పండిన పంటలు అన్నీ సమానంగా
పంపకమైనయి

కానీ
మా ముత్తాత – తాతకు అందిచ్చిన బుగులోని తీర్థయాత్ర
మా తాతతోనే ఆగిపోయింది
అన్ని పంచుకున్న కొడుకులు –
ఉజ్జోగం సజ్జోగం కోసం కొత్త యాత్రలు పోయింద్రు!
ఎక్కడెక్కడికో ఎగిరిపోయింద్రు!

ఇప్పుడు మా తాత... బుగులోని తీర్థానికి మా యాత్ర
రెండూ చిన్నప్పటి జ్ఞాపకాల లెక్కనే....
నడిమిట్ల ఆగిపోయిన ప్రయాణం లెక్కనే....
తెగిన తంతె లెక్కనే...
తల్లి పేగును తెంపుకున్న పసిబిడ్డ లెక్కనే......!

***(మే, 2011)***

# 3

## బోనం సాక !

తల్లి పుటుకనిస్తది
బోనాల తల్లి సల్లని బతుకునిస్తది
నమ్మకమా – నిజమా ఏదైతేంది
బస్, మనిషి మంచిగుంటే సాలు గద ....
జోష్ గ, జబర్దస్తుగ జిందగీని జమాయిస్తే సాలు గద...!

ఇయ్యాల నగరం
అడ్డంగ – నిలువుగ మస్తుగ ఎదిగింది
వలపట – దాపట ఫుర్సత్ గ పెరిగింది
అంత్రాలు అంత్రాలుగా మబ్బుల్ని అందుకుని
కాలనీలు కాలనీలుగ భూమి కొస్సలకు చేరుకున్నది
చెర్లు మునిగి బంగ్లాలు– బస్తీలు మొలిసి
గుట్టలు కరిగి విల్లాలు, మాల్ లు అఫ్సోసుగ వెలిసి
కబ్జాలు, దర్జాలు, దందాలు ఆస్మాన్ ను తాకినై .!





అయితేంది?
ఆషాడం వచ్చిందంటే  సాలు
గోల్కొండ ఖిల్ల మీన తీన్మార్ డప్పు
నపీర, డోలు, తాషల సప్పుడు
డిక్కిరి డిక్కిరి డీం డీం ... డిక్కిరి డిక్కిరి డీం డీం ...
డిల్లేమ్ బల్లెం డీమ్ డీమ్... డించిక్ డించిక్ డీమ్ డీమ్...
అని మోగుతది

ఇంకేమన్నా ఉన్నదా ....
పూరా హైదరబాద్ పూనకాలచ్చి శివాలూగుతది
పోతరాజు చిందులేసి పండగ ముచ్చటను ఎరకజేస్తది
బోనమెత్తి గజ్జె కట్టి పలారం బండెక్కి వాడవాడ తిర్గుతది
అమ్మతల్లికి సీరెసారెలు బెట్టి
కోడ్ని కోసి, ఆనిక్కాయ గొట్టి , పొట్టేల్ ను పడేసి
అందరికీ పంచుతది
పిల్లాజెల్లలందరిని సల్లగ కాపాడమని
దీవనార్తి పడ్తది...
అమ్మలగన్నయమ్మకు శనార్తి పాడుతది ....!

బోనాలజాతర షురువై
లాల్ దర్వాజ, చార్మినార్,
అక్కన్న మాదన్న-దర్బార్ మైసమ్మల మీంచి
లష్కర్ ఉజ్జయిని మహంకాళికి మొక్కులు అప్పజెప్పి
బల్కంపేట ఎల్లమ్మదాంక సాగిపోతది



అంతేనా –
దేశమంతటా ఉన్న ఆడబిడ్డలను
నగరానికి రప్పిత్తది
ఆషాడం అరిష్టమో శూన్య మాసమో కాదు
ఆడోళ్ళ పాదాలకు పసుపు పూసే అదృష్ట కాలం అనిపిస్తది ...
జనాలకు, జీవితాలకు మాత్రమే కాదు
మొత్తం లోకానికి ఆడబిడ్డే దిక్కు అని
యాది చేసుకునేలా చేస్తది ....!

ఇక నగరం మొత్తం Cosmetic మేకప్పులను తీసేసి
పెద్ద ఊరుగ మారిపోతది
ఊపర్ సే ఎన్ని Powder లు రుద్దినా
పైపైన ఎన్ని నుమాయిష్ లు– నగిషీలు అద్దినా
తన అస్లీ నిషాన్ – పహ్లీ బునియాది మాత్రం
తమామ్ పల్లెనే అని మురుస్తది !

ఎన్ని సెప్తే ఏమస్తది
ఎంత జేత్తే ఏమున్నది
నువ్వేమో ఇది పండుగే కాదంటివి
ఇదంత అనాగరికం అంటివి
Cosmopolitan City ల ఇవన్నీ అవమానాలంటివి !

అందుకే ఇప్పుడు,
మట్టి కుండచుట్టూ కుంకుమ బొట్లు బెట్టి
వేపాకులు సుట్టు కట్టి, నూనెవత్తులకు దీపం పెట్టి
రేపటి తండ్లాటలన్నీ ముడుపు కట్టింది తెలంగాణ.!
బోనాన్ని తలకెత్తుకోని
సాంపి సల్లి , సాలు కట్టి, సాకుకోని
సావుకెదురు నిల్సింది నా తెలంగాణ !

ఇక, బోనం సాక –
మన అస్తిత్వ పతాక !
తెలంగాణ గడ్పల్ల పసుపు కుంకుమల దీప శిఖ !!
మట్టి బిడ్డల గుండెలల్ల ప్రవహించే రక్త రేఖ !!!

*(ఆషాఢం, 2011)*

# 4

## చత్తిరి

1. అత్త అస్మాన్
కోడలు జమీన్
ఆషాడంల అత్తకోడండ్లు
మొఖాలు మొఖాలు సూస్కో వద్దంటరు
గనీ, గీ ఆషాడంలనే గమ్మత్తి జర్గుతది గదా !

2. జేష్టం దాక అస్మాన్ అంతా మండిపోతది
జమీన్ ని అంతా నెర్రెలు బడేట్టు సేత్తది
గంతటి రోకళ్ళు పగిలి పోయే రోయిణి కాలం గుడా
ఆషాడం రాంగానే నిమ్మల పడ్తది
జమీన్ కోడలు కడుపుల ఇత్తనం బడే
సైమం అచ్చిందని తెల్వగనె

ఎండల్ని – ఉడ్కు పోతల్ని ఇచ్చిన ఆస్మాన్ అత్త
చినుకుల్లెక్క  సల్లబడ్తది
మబ్బుల మీంచి వానై కురుత్తది!

3. గప్పుడు చత్తిరి మతిల కత్తది
దాన్ని పోయినేడు అటక మీద పెట్టినట్టు యాదికత్తది
గూన పెంకుటింట్ల ఓ మూల డొల్ల పోయిన గుమ్మి పాకి
ఇంటి వాసాల మీన ఉన్న అటక మీదికి ఎక్కుత
అట్కు మీద
బూజు పట్టిన పాత బొక్కెన – చీకి పోయిన తాడు
తాతల నాటి చిల్లు పోయిన గంగాళం
చింత పండు తోముడు లేక కర్రె బడ్డ ఇత్తడి బిందె
కట్టెల పొయ్యి కాగుడికి నల్ల బడ్డ సత్తుగిన్నెలు
కొన్ని టేకు ముక్కలు – పాత చెప్పులు
చినిగిన మా నాయ్న దోతి – అవ్వ పాత చీరలు
నేను పుట్టక ముందు
మా ఎలుపటి దాపటి ఎద్దులకని పర్కాల అంగట్ల
మా నాయ్న తెచ్చిన గజ్జెల పట్టీలు
చేతికి తగుల్తయి
అసొంటనే చత్తిరి కన్పిత్తది
దాన్ని సూడంగనే
చీకట్లల్ల బజారు మీద ఓ గోడ మూలకు నక్కిన

దిక్కులేని కుక్క యాదికత్తది
ఇన్నొద్దులు పట్టించుకోనందుకు
అలిగి ముడ్సుకొని పడుకున్న మా ముత్తవ్వ లెక్కనిపిత్తది
నీటి సుక్క కరువై నారేయక నీరు పెట్టక
పడావు బడ్డ నా పొలం కండ్లల్ల కనబడ్తది!

దుమ్ము దులిపి పాత గుడ్డ తోని తుడ్సినంక
చత్తిరి మల్ల నిగనిగ లాడుతది
వంకీ తిర్గిన చత్తిరి నా చేతిలోకి రాంగనే
నాకు ఎక్కడలేని రాజసం వచ్చినట్లయితది
నా ఒంటరి నడకకు తోడు దొర్కినట్లయితది!

4. ఇగ రాసకార్యం ఏదీ లేకపోయినా
వాన పడ్తానప్పుడు
మా వాడ దాటి సడుగు మీదికి వత్త

పెయ్యంత నిండు చెర్వు లెక్క అయి
గొడ్లను తోలుక పోతున్న మల్లి గాడిని సూసి
చత్తిరి కింద నేను
వాన సుక్కలకు తడ్వకుంట నడుత్తానందుకు
మా గర్రుగ అనిపిత్తది

ఇగో, ఎవ్వలకి తెల్వని ముచ్చట నీకు చెప్పనా
మా ఊళ్లోల్లకి నా చెత్తిరి సూపియ్యదానికే
వానల్ల నేను ఇల్లు దాటి వత్త, ఎర్కేనా?

అయితమాయె గనీ,
గిదంత పై పై పటారమే
నివద్దిగా చెప్తే గీ వానల చత్తిరి ఉంటె
పక్కన మనిషున్నట్టే !

కాల్వ గట్టు తెగి నీళ్ళు
పొలంలకి అగులు బారుతానప్పుడు
నేను ఉరికురికి పోయి కట్ట కట్టేది
గీ చత్తిరి బలం సూస్కునే..
ఇంటి మీది పగిలిన గూనెల నుంచి
వాన నీళ్ళు కారుతానప్పుడు
మా బడి పుస్తకాలు తడ్వకుంట కాపాడేటిది
గీ చత్తిరే ..

5. ఇగ, బజార్ నల్ల కాడ్నుంచి మంచి నీళ్ళు తెచ్చేటపుడు
లసుమక్క వసుదేవున్లెక్క
దాని తలకాయ మీది బిందె కిష్ణ పరమాత్మున్లెక్క
చెత్తిరేమో ఆది శేషున్లెక్క
నా కండ్ల కన్పడ్తది



మా ఐదేండ్ల అఖిలు
ముడ్డి మీద జారుతున్న నెక్కరును ఎగేసుకుంట
చత్తిరి పట్టుకోని వత్తాంటే
వామనుడే మా వాకిట్లకి నడ్సి వచ్చినట్లనిపిత్తది

కచ్చీరు అంగట్లకు
కూరలకు వచ్చిన రాజయ్య
చత్తిరి పట్టుకోని నిలబడితే
గోవర్ధన గుట్టని యేలు మీద నిలబెట్టిన
గోపయ్య లాగనిపిత్తడు !

బీడీల గంప మీద
చత్తిరి పట్టుకొని వచ్చే కమలమ్మ
పల్లాకిల పెండ్లి పిల్లను తీస్క పోతాన
ముత్తయిదువ లెక్కనిపిత్తది
చత్తిరి పట్టుకోని
భుజాల మీద నూలు సుట్టలను
మోస్కుపోతాన మార్కండయ్య
మబ్బుల్ని మోస్కపోతాన ఇంద్రుని లెక్కనిపిత్తడు ..

6. మీ అసోంటోల్లకు చత్తిరి అంటే
ఆరు ఇనుప పుల్లల మీద కప్పిన నల్ల గుడ్డ.
గనీ, నా అనుబంల, నియ్యత్ గ చెప్పాల్నంటే
గీ వానా కాలంల చత్తిరి -
చినుకులల్ల పూసిన నల్ల తంగేడు పువ్వు
వూరి చెర్వు కట్ట మీద పెద్ద మర్రి చెట్టు
మనకు సాత్ గ నిలబడ్డ జిగిరి దోస్త్ !

7. గీ వానాకాలంల చత్తిరి
అత్తా కోడళ్ళ పంచాయితి నడిమిట్ల
అడ్డంగ నిలబడ్డ ఎర్రి బాగుల కొడుకు... !

***(18 సెప్టెంబర్, 2013 'సారంగ' వెబ్ మ్యాగజైన్‌లో ప్రచురణ)***



# 5

## చెరుకు బాయి!

అప్పట్ల నాకు అది పెద్ద డౌటు
ఈ బాయికి గా పేరెందుకచ్చినట్టు అని!
నా చిన్నప్పటి కాలంల నేను సూడలే
నాకన్నా ముందున్న పెద్దోల్లు గూడ నాకు చెప్పలే
మీదికెల్లి, ఎవల్నడిగినా ఎదురు సవాలే...
మీతాత కట్టిచ్చిన బాయి కత నీకే తెల్వదా అని!

కానీ, ఎవ్వలకు తెల్సినా తెల్వకున్నా
గా బాయికి మాత్రం చెరుకుబాయి అనే పేరు పడ్డది!
గా బాయికి ఏ దిక్కుల్ల చూసినా
చెరుకు తోటలు లెవ్వు
అసలు, నేను బుద్దెరిగిన కాడనుంచి మా ఊళ్లే
చెరుకును ఎప్పుడు కూడా పండియ్యలే
మరి ఆ బాయికి గా పేరెందుకచ్చింది?

రోజు పొద్దుగాల్నే లేచి
పొలాలకు చెంబట్క పోతంటే
చెరుకు బాయి కనబడేది
నిజానికి చెప్పాలంటే
చెరుకు బాయి దాటినంకనే
పడావు భూములుండేటియి!

అందుకే, మా ఊరి జనాలకు
తాటిచెట్ల సందులనుంచి సూర్యుడు,
యాపకొమ్మల సందులల్ల చంద్రుడు
చింతచెట్టు మీన కాకి - గంప పక్కన కోడి
పెరట్ల బంతిపువ్వు-అంగట్ల మొగిలిపువ్వు
తుమ్మలల్ల మేక-చెరువులల్ల చాప
ర్యాగట్ల పత్తి-గుడిల దీపపు వత్తి
వాకిట్ల ముగ్గు - ముసలోళ్ల దగ్గు
గుడిసె ముందటి చొప్ప పందిరి -
యాప చెట్టు కింద నులక మంచం
కొట్టంల ఎడ్లు - పొలంల నాట్లు
ఊళ్ళెకు ఎర్ర బస్సు టికెట్లు
గడ్పకు పసుపుకుంకుమ బొట్లు ఇవన్నీ ఎట్లనో
చెరుకు బాయి గట్లు కూడా అట్లనే...
మాకు ఆ బాయి దర్శనం లేకపోతే
తెల్లారినట్టే కాదు.
పొద్దు పొడిసినట్లు లెక్కకు రాదు!

చెరుకు బాయి సుట్టుపక్కల గూడ
అంత గమ్మత్‌గ ఉండేటిది

మూడుపక్కల పెద్దపెద్ద మట్టి దిబ్బలు
వాటిమీన పచ్చగ కలకలలాడే చిన్నా పెద్ద మొక్కలు
దగ్గర దగ్గరే అల్లుకుని పెరిగిన ఖజ్జూర చెట్లు
వాయిలాకు చెట్లు, మైదాకు చెట్లు ...!

సడక్ మీదనుంచి
గడ్డెక్కి బాయి దిక్కుపోతాంటే
కసంత ఫికర్ అయ్యేది...
ఏ పురుగు బూసి ఉంటదో అని...
గనీ, ఖజ్జూర చెట్టు కొమ్మలను, ఈత చెట్టు ఆకులను
చేతులతో అడ్డు తప్పించుకొని
గడ్డ దిగుతంటనే చెరుకు బాయి కంట్ల పడేటిది
నీలినది లెక్కనీళ్ళ గది లెక్క
సక్కంగ... సల్లంగ... సచ్చంగ...!

వృత్తాకారంల గుండం లెక్కుండే పెద్దబాయి అది!
బాయి పై వరకు బలంగ తాపడం కట్టిన రాళ్ళవరుస
నలుపు నీలి మిశ్రమ వర్ణంతో
నీటి చెమ్మకు తడిసి నిగనిగలాడుతుండేటియి!
పొద్దంత పచ్చ గడ్డి తిన్న బర్లు
గోధూళి యాళ్ల బరువుగా ఇంటి బాట పట్టినట్టు
బాయిల నిమ్మళంగ కదిలే అలలు
ఎండపొడకు వెండిమెరుపులను అద్దుకునేటియి!

చెరుకు బాయిల ఈతకొట్టినోడంటే
మా పిల్లగాండ్ల గుంపుల
మొనగాడి కింద లెక్క!
గట్టుమీదినుంచి డై కొట్టినోడు – గడ్డపార ఈతకొట్టినోడు
అడుగుమట్టి తెచ్చినోడైతే ‘చిరంజీవి’తోనే సమానం!

దబ్బు...దబ్బు అని నీళ్లల్ల కాళ్ళు కొట్టినప్పుడు
వింతైన నీళ్ళ సప్పుడు పుట్టేటిది
అది బాయి గోడలకున్న రాళ్ళను ముట్టి
అటెంక మట్టిగడ్డలను, వాటిపైన చెట్ల ఆకులను తాకి
పైన గట్టు మీద కూసున్నోళ్లకు
ఓ ఇంపైన సప్పుడు ఇనపడేటిది!
అదే సమయంల
ఎండకు అలలు మిలమిల మెర్సుకుంట
కండ్లకు వెల్తురు కొట్టేటియి!
అట్ల, చెరుకు బాయే మాకందరికి
ఓ పిల్లల ఆట, పొలాల పాట,
ముసలోళ్ల మాట, నీళ్ల బాట... అన్నీ...!

ఒకపాలి, ఎప్పట్లెక్కనే
ఒడ్డుమీదకూసోని సూత్తా ఉంటె
తీట సోపతిగాడొకడు
నన్ను ఎనుక నుండి బాయిలకు తోసిండు
ఏమీ అర్థంకాలే... ఏదీ మతిలకు రాలే
దబ్బున నీళ్ళల్ల పడి మునిగి,
నీళ్ళల్ల కండ్లన్ని సల్లబడి
కాళ్ళను, చేతులను తపతప కొట్టి తేలుకుంట
హైబత్‌ల నీళ్ళుమింగిన...

అరే బుచ్చిగా, నూకితే నూకినవ్ పో
గిన్నొద్దులకు చెరుకు బాయికి
గా పేరెందుకుకచ్చిందో ఎరుక అయింది...!

***(2007 ఆగస్టు)***



# 6

## దారం కట్టిన సందమామ

పురాణాల కాలంల అర్జనుడు బాణాలతోని
సర్గానికి నిచ్చెన ఏసిండట
ఆ నిచ్చెన ఈ కాలంల
ఏ అవతారం ఎత్తిందో ఎర్కేనా ?

✻ ✻ ✻

అమ్మ నన్ను సంకకెత్తుకొని
సందమామను సూపిచ్చి బువ్వ పెట్టేటిది
అప్పటి సంది నాకొక్కటే ఖాయిష్
గాలి బుగ్గ లెక్క
సందమామకు దారం కట్టి
ఎన్నీలను నా ఎన్క తిప్పుకోవాల్నని
ఇది నిజమయ్యే ముచ్చటేనా ?

నా చిన్నతనం ల పతంగి అంటే
పానం ఖుషీ ఖుషీ అయ్యేటిది
మా చిన్న సేతులు కొత్త పనిమంతులు అయ్యేటియి
ఒకసారి వయ్యిల తెల్ల కాయితం
ఇంకొక్క సారి వార్తల పత్రిక
పతంగి అవతారం ఎత్తేటియి
గొంగళి పురుగు సీతాకోక చిల్క అయినట్టు !

పతంగి
ఏం సద్వకుంటనే మమ్ములను ఇంజనీర్లను సేసింది
వెదురు పుల్లలు– దారం కట్లు– తోక అతుకులతోని
మేం సేసిన మొదటి Aeronatic ప్రయోగం ఇదే !

పతంగి–
ఏ అనుబం లేకుంటనే
మమ్ములను తత్వవేత్తలను సేసింది
తీరొక్క ఉపయోగం ఉన్న వస్తువులకు
కొత్త రూపు – కొత్త అర్థం ఇయ్యచ్చుని
సమజయింది ఇప్పుడే!

అంతేనా ?! ....
పతంగి–
మా తెలివికి తొలి పదను
మా ప్రణాళికా శక్తికి మొదటి అదను

అది మమ్ములను
నయా నయా తొవ్వలల్ల సోచాయించేటట్టు చేసింది
మా బేజాకు మస్తుగ పని పెట్టింది
ఏం కాయితం, ఏం రంగు, ఏం డిజను కాడ్నుంచి
దాని సైజు, తోక పొడవు, కన్నాలు, దారాల దాంక
ఇదంత ఒగ సైన్సు ప్రయోగం లెక్కుండేటిది
దాని షేపు చతురస్రం
కానీ, మేం చేసే ఆలోచన్లు మాత్రం సహస్రం !

పతంగి తయ్యారు సేసుడు ఒక పెద్ద ముచ్చట --
సంకురాత్రి సెలవులు మొదలు కాంగనే
మేం చేశే మొదటి పనేందో తెల్సునా ?
దారం కోసం దేవులాట !
మా ఊరి చేనేత సంగం నేత గాళ్ళు
మొగ్గం మీది నుంచి కోసి పారేసిన దారపు ఉండలే...
మాకు విలువైన బంగారు కొండలు!
పోగుపోగును ముడేసి
జొన్న కంకి బెండుకు ఇగురంగ సుట్టి
ఎప్పుడు తెల్లారుతదా అని ఎదురు సూసేటోల్లం

పొద్దు గాలనే
పతంగిని కుడి సెయ్యి వేలి కొసల మీన
దారపు బెండును ఎడమ సెయ్యిల పట్టుకొని

ఊల్లెకెల్లి పోతాంటే
మెడల గొలుసు కట్టుకున్న కుక్క పిల్ల
మా ఎన్క తోకూపుకుంట
గాలిల తేలుకుంట వచ్చినట్టు అనిపిచ్చేటిది

ఇగ, ఎగరేసుడెట్ల ?
ముందుగాల ఊళ్లె గాలి రువ్వడి
ఏ దిక్కుల బాగ ఉన్నదో సూడాలె
ఊరి బైట, కోత కోసిన పొలాల పొంటి తిర్గాలె
సాయిత గానికి పతంగినిచ్చి దూరంగ నిలవెట్టి
కొంచెం దూరంల దారం పట్టుకోని
గాలికి ఎదురుంగ ఉరుకాలె
గప్పుడు పతంగి గాల్లకి లేసేటిది
దారాన్ని ఇడ్సుకుంట ఇడ్సుకుంట
నేను సుకూన్ గ పతంగిని ఎక్కిచ్చేటోన్ని

ఇదంత యిప్డు యాజ్జేసుకుంటె
SWOT analysis, Modern Management Strategy అంత
పతంగి మజిలీల ఉన్నట్టనిపిత్తది
గిన్నేళ్ళల్ల ఈ పట్నంల పతంగినైతే ఎగిరెయ్యలేదు
కనీ, గా చిన్నప్పటి యాద్గార్ లు అన్నీ
నన్ను మనిషి లెక్క ఎదిగిచ్చినయ్



ఇపుడు నాకు పతంగి అంటే–
పైలోకాలనున్న ఏ దేవునికో
నేను పంపించే ధన్యవాదాల ఉత్తరం !
ఆస్మాన్ కు మనం చెప్పే ఆదాబ్... షుక్రియా.. !
అంతరిక్షం మీన
మనకాలపు అర్జనుడు ఏసిన కాయితపు నిచ్చెన !

పతంగి అంటే–
దారం కట్టిన సందమామ!!

*(23 జనవరి 2017 'నమస్తే తెలంగాణ' చెలిమె పేజీలో ప్రచురితం)*

# 7

## దోని నీళ్ళు!

అనుకుంటం గనీ–
నీళ్ళల్ల సుత తీరొక్క రుచి ఉంటది,
మా దోని నీళ్ళ లెక్కనే!

కంటి సూపుకు గివ్వన్నీ నీళ్ళే
తెల్లగ, సల్లగ
పిడికిలి సందుల నుంచి ఇసుక లెక్క జారిపోయే నీళ్ళే
అరచేతులను, మొఖాన్ని, అంగీని తడిపేసి
కొన్నిసార్లు ఇంకిపోయి చుట్టాలలెక్కయి
ఇంకొన్నిసార్లు జారిపోయి సాయితగాల్లలెక్కయి
గాయిగాయి పుట్టిచ్చినయి గా నీళ్ళే!



మా ఊళ్ళె–
బాయికొొక్క రుచి, చెరువుకొొక్కరుచి
చెలిమెకొొక్కరుచి ఉండేటిది.
దేని తడి దానిదే... దేని రుచి దానిదే...
గివ్వన్నీ ఒక్కెత్తయితే
వాన కొట్టినపుడు
మా దోని నీళ్ళ రుచి ఒక్కటే ఒకెత్తులెక్కుండేది.

దోని అంటే తెల్సునా నీకు?
దోని అంటే ఇల్లు పట్టిన దోసిలి!
మా ఇంటి కప్పుల మీన
మబ్బుల వాన కోసం కట్టిన కాలువ!
బెంగులూరు గూనలన్ని కలిసి
చినుకుల గింజలను ఒక్కచోట రాశిపోసే కల్లం!

రెండు కాలాలలో ఎవరికీ పట్టని దోని
వానాకాలంల శివుని శిగల గంగలెక్కయితది
అప్పటిదాంక సడీసపుడు చెయ్యక
ఇంటి కప్పు మీది చెత్తను
రాలిపడిన యాపచెట్టు ఆకులను నింపుకొని
వడ్లబస్త లెక్క గమ్మునుంటది
తొలిచినుకు పడంగనె
దబ్బదబ్బ ఆ సరుకునంత ఖాళీ చేత్తది!

అన్ని  కాలాలల్ల నిల్వనీళ్ళే మాకు అలవాటు
తాగడానికి, వంటలకు, బోల్లు కడగడానికి, తానానికి
గొడ్లను, సందుగలను, నాగల్లను కడగడానికి
బట్టలను–బాతలను  ఉతకడానికి
అన్నింటికీ నిల్వ నీళ్లే
చెర్లయో, బాయిలయో, నల్లాలయో...!

వానలు కొట్టి, దోనిల నీళ్ళు ఉర్కచ్చినపుడే
మాకు తాజా నీళ్ళు
సీదా మబ్బులనుంచి, ఆస్మాన్ నుంచి
దోనిలకు నీటి ముల్లెలు వచ్చి పడ్తయి
చాలాదినాల సంది మూలకున్న బిందెలు, గిన్నెలు, గంగాళాలు
గలగలమనుకుంటా మా చేతుల్లకు వచ్చికూసుంటయి.

దోనికింద మత్తడి పడ్డట్టు నీళ్ళు
బిందెనక బిందె, గిన్నెనక గిన్నెను నింపుకుంట మా చేతులు
అంగీ–లాగు తడిసి ఒళ్ళంత తడిసి,
అరచేతులు అరిపాదాలు సుత నీళ్ళల్ల నాని నాని తెల్లపడ్తయి
అన్ని అయినంక, దోని నీళ్ళను దోసిలి తోని తాగుతాను
కొత్త రుచి.... మబ్బుల రుచి... ఇనుపరుచి... వేప పసరు రుచి
అన్నీ కలిపిన ఇంకేదో తెల్వని కొత్త రుచి...



ఇప్పుడు,
ఆలోచనల మబ్బులు అచ్చరాల చినుకులను కురిపిస్తే
అవన్నీ సాహిత్యం దోనిల నుంచి
కవిత్వం నీళ్ళుగా దుంకుతానై
వాటిని పేజీల దోసిళ్ళతో ఒడిసిపట్టి
నీ కోసమే ఇక్కడికి తోలుకొచ్చిన...

అనుకుంటం గనీ,
నీళ్ళల్ల సుత తీరొక్క రుచి ఉంటది
మనుషుల్లెక్కనే...!
అచ్చరాలల్ల సుత తీరొక్క ముచ్చట ఉంటది
కవిత్వం లెక్కనే...!

*(2018 శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది కవిసమ్మేళన కవితా సంకలనం 'అలుగు దుంకిన అక్షరం'లో ప్రచురితం)*

# 8

## E-1, రూమ్ నంబర్ 70

ఇంత పెద్ద దునియాల – కాలేజీ దినాలల్ల
నీ కోసం ఒక ఠికానా ఉండాలె
ఆ ఠికానా ఉస్మానియా హాస్టళ్లనే ఉండాలె...!

మా అమ్మ
నన్ను తొమ్మిది నెళ్ళే కడుపుల  మోసింది
కనీ, గీ రూమ్
నన్ను నాలుగేండ్లు కడుపుల పెట్కోని దాసుకుని
నా హరొక్క కైతికాలకు సాతిచ్చింది
బొమ్మలేసినపుడు
గోడను క్యాన్వాసులా మలచి
దొడ్డు బుక్కులను పెట్టేటందుకు
బీరువా లెక్క నిల్సింది

నాకొొక్కనికేనా?
నా ఖాయిష్ లన్నిటికీ సాత్ దారైంది–
నేను నీళ్లు తాగే కూజాకు
నాయ్న పంపిన మని యార్డర్ కు
రాస్కునే టేబుల్ కు
అమ్మ పంపిచ్చిన వెంకన్న బొమ్మకు
పండుకునే ఇనుప మంచానికి–
చెల్లెండ్లు రాసిన In-Land Letter కు
ఉతికి ఆరేసిన అంగీకి, లుంగీకి,
మా ఊరి ముచ్చట్లకు
రాసి పారేసిన కవిత్వానికి–రాలి పడిన మాటలకు
తార్నాకకెళ్లి తెచ్చుకున్న అరటి పండ్లకి
*"ఏక్ లడ్కీ కో దేఖా తో ఐసా లగా"* కూని రాగాలకు
చీకటి రాత్రుల సదువులకు
ఐతారం మధ్యానం నిద్రలకు
నాతోటి సాయిత అయింది ...

ఈ Room –
Black & White లో
చే గువేరా, మధు బాల, వివేకానంద Poster లను
అంతరాలకు అతీతంగా పక్క పక్కన కూసుండ బెట్టి
Competitive పరీక్షల Season ల
కత్తులు లేని యుద్ధానికి నన్ను తయ్యార్ చేసింది

తల్పులకు అద్దాలు చెక్కుకొని
ఎప్పుడు పడ్తే అప్పుడు నాకు నన్ను సూపిచ్చి
నా సూపుకు Life ఇచ్చింది
పొద్దుగాల లేవంగనే
ఆకు పచ్చని చెట్టుకు పూసిన పసుపు పచ్చని పూలని
నా కండ్లతో ములాఖాత్ చేయించింది
జాలీల కిటికీ సందుల కాంచి
ఈ దునియాను నాకు పరిచయం చేసి
సూర్యున్ని నా మొఖం మీదికి తెచ్చింది
నా రేపటి కలలన్నిటినీ కప్పు మీద పేర్చి
జరమచ్చిన యాళ్ల నా మూల్గులకి దుఃఖ పడింది !

ఈ Room –
నాకు అమ్మయింది – గురువైంది– దోస్త్ అయింది
ఒక్క ముక్కల జెప్పాల్నంటే
నాకు జీవితమే అయింది !

అందుకే, ఇప్పటికీ నాకేమనిపిస్తదో చెప్పనా?
ఇంత పెద్ద దునియాల –కాలేజీ దినాలల్ల
నీ కోసం ఒక ఠికానా ఉండాలె
ఆ ఠికానా ఉస్మానియా హాస్టళ్లనే ఉండాలె...!

*(13 మార్చి 2017 'నమస్తే తెలంగాణ' చెలిమె పేజీలో ప్రచురణ)*



# 9

## Fusion షాయరీ on తెలంగాణా జమీన్!

1. భూగోళం మీన బారాణా వంతు నీళ్ళే, చారాణా వంతే భూమి. గనీ గీ చారాణా జాగలనె total civilisation నడిచొచ్చింది. మొత్తం human evolution ప్రవహించింది. యుగాల సంది నేల మాత్రమే మనకు నెలవయింది.. మన ఆశల కొలువయింది.. మన గమనానికి మలుపు, మన గమ్యానికి ఇలవేలుపు అయింది.. మన journey కి మేలుకొలుపు అయింది..

*Of course, మట్టి గొప్పది.. మట్టి సూపిన బాట గొప్పది!*

2. మనిషి bodyల 95 percent skeleton and flesh... 5 percent మాత్రమే గుండె కాయ. గనీ గీ గుండెలనే పూరా life ఉన్నది, రేపటి ఆశల knife ఉన్నది, మన existence కి ఓ proof ఉన్నది. కనిపించని అణువు లోన infinite power ఉన్నది. ‘లబ్ డబ్’ అని కొట్టుకొనే గుండెలల్ల, పుట్టిన గడ్డపై అంతులేని అభిమానం, వంతులేసుకోలేని అనురాగం ఉన్నది.

గా గుండె సప్పుళ్ళే గిప్డు universe ని ముట్టినై. Adverse ఆటంకాలన్నిటినీ overcome చేసి, Free Verse నీ, ఇస్ జగాహ్ పె నయా నగమ్ నీ, bidri work అంత aesthetic గా, నకాశీ పటమంత colorful గా, పాండవుల గుట్ట మీద శిల్పాలంత wonderful గా ఈ మట్టి బెడ్డలని పాటలు పాటలుగా చెక్కినై.

*My dear folks, ఎన్ని techniques తో చెప్పినా, మరెన్నిటినో technical గా విప్పినా, గుండె గొప్పది.. గుండెల్లోని ధైర్యం గొప్పది.. తూర్పు దిక్కుకు వెలుగునిచ్చిన వర్ణం గొప్పది... వర్ణానికి వన్నెలద్దిన మట్టి గొప్పది!*

3. దోస్తులారా, హర్ ఏక్ బార్ చెప్పినా, హజార్ బాత్ చెప్పినా నేల గొప్పది.. మనల్ని, మన ఏడేడు తరాలని, మన కలలని, మన బలాలని, బలగాలని కన్న నేల గొప్పది. మనం వేసిన seeds of dreams నీ, మనం నేసిన clothes of streams నీ, మనం కాసిన fields of crops నీ హత్తుకున్నదీ, తలపైకెత్తుకున్నదీ, తలపుల్లో సైతం మనం గొంతెత్తి మొత్తుకునేలా చేసింది ఈ నేలే కదా..

Its true, నేల గొప్పది.. సాలు సాలునా నెత్తుటితో, కన్నీటితో తడిసిపోయింది కదా.. గడ్డ గడ్డనా త్యాగాలనీ, ప్రేమనీ passionate గా, compassionate గా నింపేసింది కదా... వాడ వాడనా తూటా బొబ్బలనీ, లాఠీ దెబ్బలనీ శిఖాయత్ చెయ్యకుండా దాచుకుంది కదా..

*That's why, మట్టి గొప్పది... తెలంగాణా మట్టి బౌ గొప్పది!*

4. జల్ –జంగల్– జమీన్ కోసం ప్రాణాల్ని బాణాలుగా ఎక్కుపెట్టిన వీరులను కన్న భూమి ఇది. భూమి– భుక్తి– వెట్టి చాకిరి విముక్తి

కోసం నాగలి పట్టిన చేతులతోనే gun లనీ, pen లనీ, pen-gun లనీ పేల్చిన అడవి బిడ్డలనీ, ఆడ బిడ్డలనీ పెంచిన భూమి ఇది. "బాంచెన్ కాల్మొక్తా" నుండి "బాకునై పాణాల్ తీత్తా" అని గుడ్లెర్ర జేసి గర్జించిన freedom fighters కి ఉగ్గు పాలు అందించిన పోరాటాల అడ్డా ఇది. ఎప్పటికప్పుడు మోసగించ బడుతూ, అప్పటికప్పుడు తిరగబడుతూ revolution నీ, rebellion నీ భూమి తన చుట్టూ తాను తిరిగినంత సహజంగా, తన existence కోసం fighting instinct ని కొత్త identity card గా మార్చుకున్నంత అనివార్యంగా నాలుగున్నర కోట్ల voices తో పోటెత్తిన భూమి బిడ్డల గడ్డ ఇది...

*Indeed, ఈ మట్టి గొప్పది.. ఈ మట్టి మండించిన ఉద్యమాల బట్టీ గొప్పది!*

5. చెరసాలలలో మగ్గిపోయి, ఉరికొయ్యలపై ఎండిపోయి, encounters లో ఆరిపోయి, suicide notes పై ఇంకిపోని సిరాగా మారిపోయి, rubber bullets కీ, water canons కీ నిలువెత్తు గాయాలుగా వేళ్ళాడి, suppression పై, state anarchy పై జంగ్ లెన్నో చేసి, దిల్లుని విల్లులా వంచి, ఎదురొడ్డి, ఎద ఒడ్డి, రొంబొచ్చెలు ఇర్సుకొని నిలబడ్డ పోరు బిడ్డలకు పుటకనిచ్చిన భూమి ఇది. స్వేచ్ఛ కోసం, ప్రాంతేతరుడి ఇనుప కౌగిలి నుండి విముక్తి కోసం అరవై ఏళ్ళుగా అరిచేతులపై నడుస్తూ, అరిపాదాలకి మోలలు గుచ్చుకుంటూ అరిగోస పడి, మానుకోట కంకర రాళ్ళుగా మారి, ఆఖరికి 'అర్రెర్రె .. నీయవ్వ' అని నాలుక మడ్తబెట్టి, గుత్ప పట్టుకొని ఉర్కచ్చిన సకల జనులకు ఆనుపానులు నేర్పిచ్చిన నేల ఇది...

*షాయద్, ఈ మట్టి గొప్పది... ఈ మట్టి నుండి పుట్టిన ప్రజానీకం గొప్పది!*

6. నిజమే, వాళ్లన్నట్టు మనది బక్క పానమే... ముక్కులల్ల పానాలు పెట్టుకున్న బొక్క పానమే.. గనీ, years together ఆగకుంట, ఆపకుంట మా ఖ్వాబ్ నీ, ఖాయిష్ నీ, ఖయాల్ తప్పకుండ చెప్తనే ఉన్నం.. మా గుజారిష్ ని ఇన్పిత్తనే ఉన్నం.. సర్ఫరోష్ లు ఎన్నో చేత్తనే ఉన్నం.. గిన్నాళ్ళకి, ఇపుడు వాళ్ళందరికీ సుక్కలు సూపిచ్చినం. సుక్కలకెక్కిన మా martyrs, young warriors కన్న కలలని ఇపుడు reality చేసినం and final గా మా జెండా పాతినం... తెలంగానం పాడినం...

*Absolutely, ఈ మట్టి గొప్పది... ఈ మట్టి నేర్పించిన పోరాట స్ఫూర్తి గొప్పది!*

7. "Ayes have it, Ayes have it, Ayes have it.. Bill passed" విజయం వరించింది. యుద్ధం ముగిసింది. కానీ పోరాటం ఇంకా ఉంది. గిప్డు, తెలంగాణా గుండె ఆరాటాలను తీర్చే అగ్గి బరాటాలుగా మనం మారాల్సి ఉంది. లంబీ రాత్ అంతం అయింది. నయా సుబాహ్, నయె రంగ్, నయీ ఉమంగ్ రెక్కలు తొడుక్కొని ఎగరడానికి ready గా ఉన్నాయి. Take-off చెయ్యాలి. Talk of the nation కావాలి..

జరూర్, ఈ వేకువకి వికాసం రంగులు అద్దాలి.. We have to turn this Summer into Spring...

*After all, ఈ మట్టి గొప్పది... తెలంగాణా మట్టి మా గొప్పది!!*

***(27 సెప్టెంబర్ 2015 'నమస్తే తెలంగాణ' బతుకమ్మ ఆదివారం అనుబంధంలో ప్రచురితం)***



# 10

## గుట్టను పగలేసినం

1. సూసి సూసి ఇగ తెగిచ్చి
గుట్టల్ల బాంబు పెట్టినం !
సుతిలికి అగ్గి పెట్టి
గుట్ట ఇగ పేలుతదా  అగ పేలుతదా
అని యెదురు సూసినం

2. అరవై సాలుల కింద
మా ఊరు బాగానే ఉండె
మా తాత చెప్పెటోడు
నీళ్ళు మస్తుగుండే – పన్లు దొర్కుతాండే

ఊరు ఊరంత పచ్చంగ కలకలలాడుతుండేనట
గా దినాలల్ల
దొరలు, దేశాయ్‌లు, దేశ్‌ముఖ్‌ల పెత్తనాలు
రజాకార్ల దోపిడీలు ఉండేనట !

గనీ, గవన్నీటినీ
మా తాత– అయ్య తోటోల్లు తిర్గకొట్టి
ఊరి బొడ్రాయి దంక ఉర్కిచ్చి పంపిచ్చిన్రంట !

తుపాకులు పట్టినోల్లు–
తూర్పు దిక్కు సూర్యుళ్ళు అయినోల్లు
గంత బడా బడా లడాయిలు సేసిండ్లు గనీ
గప్పుడు గప్పుడే నడి ఊల్లె నెర్సిన
బండ రాయిని సూడక పాయె
సూసినా, నాప రాయి– నల్ల రాయే గదా
పొలంలకచ్చినా– కంచెలకచ్చినా
వాకిట్ల కచ్చినా – గొంగట్లకచ్చినా
మంచాలకచ్చినా – కంచాలకచ్చినా
ఏం జేత్తదిలే, అని అనుకున్నరట

గనీ, సూత్తాంటే సూత్తాంటేనే
గా రాయి చిన్న కొండయింది
పెద్ద గుట్టయింది
సాప కింద నీళ్ళ లెక్క
ఊరంతటినీ కబ్జా చేశింది

3. గీ ఇచ్చంత్రాన్ని
మా నాయ్న సోపతి గాల్లు గుర్తు పట్టింద్రు
వాళ్ళ చిన్న నాటికి- పెరిగి పెద్ద పెండ్లీలు సేస్కున్న నాటికి
గుట్ట యెంత పెద్ద పెర్గిందో బేరీజ్ యేశ్కున్నరు
అగులు బుగులు అయింద్రు
గుట్ట పెరుగుడును ఆపాలనుకున్నరు
అందర్నీ ఒక్కటి చేశింద్రు
గుట్టను పెకిలిద్దమని
గడ్డ పారలతో తవ్వుడు షురూ జేసింద్రు!

యెంత తవ్వినా గుట్ట అంతూ దరి దొర్కక పాయె
గీ నడిమిట్ల
తోటి సాయిత గాళ్ళు కొందరు
గుట్ట బాగనే ఉండే- మన ఊరికేమన్న కీడు జేత్తాందా
అని పదం పాడబట్టిరి
మన ఊరి జాడకు పాడె కట్టబట్టిరి
గుట్టను తవ్వడానికని అచ్చినోల్లు
గుట్టను సూసి సంబురపడబట్టిరి
ఏం గుట్ట మొల్సిందిరా
గే ఊళ్లనన్న గిట్లాంటి గుట్టున్నాది
అసలు, గీ గుట్టతోనే మనకు మంచి అయితాంది అని
పాటలు కైకట్టబట్టిరి

గుట్ట సేసిన మాయ ముందట
బేహోష్ అయి సోయి తప్పిన మా నాయ్న
ఊరిని పొట్టన బెట్టుకున్న గుట్టను ఏం జెయ్యలేక
గా రాత్రే మట్టిల కల్సిపాయె

4. నేను కండ్లు తెర్సి
లోకం సూసెనాటికి
నాకు, మా ఊరికంటే ముందుగాల
గా గుట్టే కన్పిచ్చె
గిప్పుడది మబ్బుల్ని దాటి ఆస్మాన్ దాక ఎదిగిపాయె
మా ఊరేమో దినదినానికి కురసగైపోయె
గిన్నేండ్ల సంది సేత్తాన మాయల్నే
గిప్డు కూడా గా గుట్ట సేయబట్టే
మా బూమిని- జాగని - పొలాన్ని
జరంత జరంత మాయం సేయబట్టె
*ఇసోంట రమ్మంటే ఇల్లంత నాదే అన్నట్టు*
గా గుట్ట ఒక దినం
మా గుడిసెను గుడా మింగడానికి వచ్చె

గప్పుడు, మా సోపతి గాల్లందరం కలిసి
అసలేం జర్గుతాందో
అంజనం ఏయించినం

కొన్ని దినాలల్ల
మేం– మాకు గాకుంట పోతం అని
మా ఊరు– మాది గాకుంట పోతది అని సమజయింది

5. గిన్నొద్దులు గా గుట్ట
చెల్కల కచ్చినా– చేనులకచ్చినా
ఊల్లెకచ్చినా - వాకిట్లకచ్చినా
మేం ఏమనలే
గనీ, మా ఇంట్లకచ్చి
మా ఇమ్మతికే ఎసరు పెడతాంటె
ఎట్ల ఊకోవాలె ?

ఇగ, సెయ్యి సెయ్యి కల్పినం
సకల జనులం ఉర్కినం
గిన్నేండ్ల అవమానాలతో బగ బగ మండి
అగ్గిని రాజేసినం
మా జిందగీలను బచాయించుకునేటందుకు
బాంబు తయారు జేసినం
అసోంటిసోంటి బాంబు కాదిది
ఉద్యమాల బాంబిది
మా పజల ఉసురును
పాణాలు ఇడ్సిన మా బిడ్డల త్యాగాలను
మందుగా దట్టించి మూటకట్టిన బాంబిది

6. గుట్టల్ల బాంబు పెట్టినం
సుతిలికి అగ్గి పెట్టి
గుట్ట ఎప్పుడు  పేలుతదా
అని యెదురు సూసినం

గుట్ట పేలింది- ముక్కలు చెక్కలయింది !

ఇన్నొద్దులు గుట్ట ముడ్డి కింద పడి
మా బూమి కన్పియ్యకుండపాయె
గిప్పుడు గా బూమి అంతా
కండ్లు పెయ్యి తిర్గేటట్టు కన్పియ్య బట్టె
మా బూమి మాకు దొర్కె -
ఇగ మా బువ్వ గుడ మాకు దొర్కుతది !

7. నా దోస్తులారా
మన గడ్డ మీన కొత్త ఊరిని పొందుబాటు చేశ్కుందాం
కొన్ని ఇత్తులని- ఇంకొన్ని చెట్లని నాటుకుందాం
కొన్ని కలల్ని- ఇంకా కొన్ని సుక్కల్ని తెంపుకచ్చి
మన బిడ్డలకిద్దాం

రా అన్నా, గా దిక్కుకు పోదం పా...

***(3 మార్చి 2014 'నమస్తే తెలంగాణ' చెలిమెలో ప్రచురితం)***



# 11

## ఇనుప కంచె... అడ్డుగోడ.. ఒక జన జాతర !

ఇదేంది, గింత అన్నాలమా?
మా ఊరికి మేము
మా  పట్నానికి మేము కదిలి వత్తమంటే గిన్ని తకిలీఫ్ లా?

గింత అన్నాలమా?
మేము ఏం అన్నం ?
అరే, మాభూమి మాకు కావాలన్నం !
మా మెతుకులు మేము పండించుకుంటం అన్నం !
మా బతుకులు మేం బతుకుతం అని అన్నం!

భూమి మీద లేని ముచ్చట అడిగినమా?
లోకంల లేని తీర్పు కోరినమా?





గొంతుతో గొంతు కలిపినందుకు
చెయ్యి తో ఇంకో చెయ్యి జత చేసి
కదం కదం కలిపి నడ్సినందుకు
గిన్ని తీర్ల తొక్కి పెడ్తరా?

ఇగో, ఓ పెద్దమనిషీ!
గిది మా పట్నం
ఎనిమిది కాదు ఎనిమిది వందల దిక్కులల్ల
నువ్వు కాపుకాసినా
మమ్ములను ఎక్కడోళ్ళను అక్కడ
సడకుల మీన రుకాయించినా
మా నడక ఆగదు...!
మా పాదం అలసిపోదు...!

నువ్వు ఇనుప కంచెలు పెడ్తవు !
బారికేడ్లను గడ్తవు !
రోడ్లకు అడ్డంగా పోలీసులను నిలబెడతవు!
మొత్తం నీ అధికారం అంతా
మా మీదనే సూపిత్తవు!

అయితే ఏమైతది?
మమ్ములను ఆపగల్గుతవా ?
నన్ను మాత్రమే కాదు



మా ఇంటి గడప దాటి
నేను మొదటి అడుగు వేసినప్పుడు
నేల మీంచి రేగిన మట్టి రేణువులను కూడా
నువ్వు ఆపలేవు!!

నియ్యి పెద్ద చేతులు కావచ్చు ....
కానీ మా గుండెల దివిటీని  ఆర్పలేవు !
నియ్యి ఉక్కు పాదాలు కావచ్చు....
కానీ మా ఛాతీల ఊపిరిని తొక్కి పట్టలేవు!!
నియ్య కత్తుల చూపులు కావచ్చు...
కానీ మా గొంతుల పాటను తెంప లేవు!!!

*మిలియన్ మార్చ్...!*
*మిలియన్ మార్చ్...!!*

పిడికిళ్లు బిగించి
దవడ కండలను పురి పెట్టి
అడ్డుపడిన కొండలను
అడ్డంగా నిలబడ్డ గోడలను
బద్దలు కొట్టి ఉరుకుతం!!
మన మట్టి తండ్లాటను
సాగరం దాకా తీసుకెళ్తం !!
మా బిడ్డల కన్నీళ్ళను
హుస్సేన్ సాగరం దాకా తోలుకెళ్తం!

***(10 మార్చి, 2011 'మిలియన్ మార్చ్' నేపథ్యంలో)***

# 12

## జెండాగా ఎగిరిన అచ్చరం

తెల్లార గట్లల్ల తలుపు గొట్టి లేపి
మా తలపులల్ల
కొత్త పొద్దు పొడిపించిన సూర్యుడు – గాయ్న !

కంటికి మింటికి ఏక ధారగా
మన మట్టి ముచ్చట్లను కై కట్టి చెప్పిన
తాళ పత్ర పురాణం – గాయ్న !

నైజాము సర్కరోని గుండెల మీన
అచ్చరాల కచ్చురాలు ఉర్కిచ్చిన
సచ్చా ఆద్మీ – గాయ్న !



దోపిడీ దారుల మెడల మీన
పిడి చాకు అసొంటి కైతల్ని దించిన
సాదా సీదా ఇన్సాన్ – గాయ్న !

గీ నేల కోసం
గీ మట్టి బిడ్డల కోసం
ఎంతటోనికైన ఎదురు తిర్గిన
గీ జమీన్ కీ షాన్ – గాయ్న !

గీ మోసగాళ్ళ రాజ్జంల
గిది గోసలు చెప్పుకునే కాలం గాదని
'గొడవ'లతోనే భడవా గాండ్లకు బుద్ధి చెప్పాల్నని
ఇకమతు చెప్పిన పెద్ద మనిషి – గాయ్న !

తెలంగాణ యెతలను
తీరొక్క ముచ్చట్లను ఒడ్వకుంట శెప్పి
మనందరిని ములు గఱ్ఱ లెక్క పొడ్శి పొడ్శి లేపిన
నియ్యత్ మనిషి – గాయ్న!

కన్ను తెరిత్తె బతుకు
కన్ను మూత్తే సావు
కంటి సూపు సూపంత తెలంగాణే అని శెప్పి
తెలంగాణనే కంటి పాప లెక్క సూసుకున్న ఫౌజీ – గాయ్న !

గాయ్న సెప్పిన మాటే
మా గుండెల్ని మండిచ్చింది
గాయ్న రాసిన కైతే
మా చేతుల్ని కత్తుల లెక్క మార్చింది
గాయ్న సూపిచ్చిన తొవ్వే
ఈ మట్టికి విముక్తి బాట యేసింది !

గాయ్న చేతి కట్టె
గిప్డు మాకందరికీ రిలే పరుగు లెక్క అయింది
1969 నుంచి 2001 పైకెళ్ళి
ఇప్పటి దాకా
ఆపకుంట, ఆగకుంట
లగాయించి బగాయించినం
గాయ్నను మతిల పెట్టుకొనే ఉర్కినం
కొసాకి
గవాన్ని పురాగ ఓడిచ్చినం !

కాళోజీ .. కాళోజీ –
నీ యాది తెలంగాణ
నీ మనాది తెలంగాణ
నీ పునాది తెలంగాణా
నీ వందేళ్ళ కల తెలంగాణ
గిప్డు –
జెండా యై నిలిచింది !
నీకు వందనం చేత్తాంది !!

***(కాళోజీ శత జయంతి ఉత్సవ ప్రత్యేక సంచిక 2014లో ప్రచురితం)***



# 13

## కొత్త సాలు ముచ్చట

గిక్కడ భూమి పుట్టినప్పటి సందీ
కొత్త సాలు అంటే మాకు ఉగాదే
శాతవాహనుల పొద్దు నుండి
కాకతీయుల కాలం నుండి
తుర్క నిజాం ల జమానా నుండి
యాప పూలు- మామిడి చిగుళ్ళు వచ్చే కాలమే మనకు కొత్త సాలు..

గనీ, గీ దినాలల్ల కాలం లెక్క- తారీకు లెక్క మారి పాయె
అంగ్రేజీ క్యాలెండరే వేగు సుక్కై పాయె
తూర్పు దిక్కుల సూర్యుడత్తడని అంటరు గానీ
పడమటి దిక్కు పంచాంగమే గిపుడు కొత్త సాలుకు దిక్కయింది
ఉగాదేమో వట్టి బచ్చాల- పచ్చడిల పండుగయింది

గా జన్వరేమో కొత్త సాలుకు కోడి కూతైంది
ఇగేం జేత్తం,.. నలుగుట్లె నారాయణ అనాలే
లోకాన్ని బట్టి నడ్సుకోవాలే !

గందుకనే, గిప్పటి దాకా గాల్లంత చెప్పిందే ఇన్న
గాళ్ళ మూర్తాలనే నమ్మిన
గాళ్ళ కండ్ల పొంటే సూర్యున్ని సూసిన
మరి, నేను జెప్పేది కూడా గాళ్ళు ఇనాలె గదా
గాల్లంతా ఇనేటట్టు జెయ్యాలె గదా..
గందుకే, గిప్పుడు నా గొంతును ఇన్పిత్తాన
నా సరిత్రను యాది జేత్తాన
నా గడ్డ పోరాటాలని పాటలుగా పాడుతాన
నా ప్రజల త్యాగాలని కైకట్టి రాత్తాన
నా జనాల ఖాయిష్ లను బండ రాళ్ళ మీన చెక్కుతాన
వెయ్యొక్క ఆత్మలు కన్న కలలని బొమ్మల్లెక్క గీత్తాన

ఐనా, నా సోస వాళ్లకు పద్త లేదు.. నా గోస ముద్త లేదు
నన్ను అపాస్సం సెయ్య బట్టే – నా మాటలకు నవ్వ బట్టె
నా మాటకు ఇలువ లేని జాగల నేనెట్ల ఉండాలె
ఇగ దిక్కు లేక గాళ్ళ దగ్గర్నుంచి యేరు బడాలనుకున్న
నా బూమిని నేను పంచుకోవాలనుకున్న
నా కొత్త సాలును నేను సేస్కోవాల్నని కలగన్న
ఉగాదినే కొత్త సాలుకి లెక్క పెట్టుకోవాల్ననుకున్న

నా కొత్త సాలుకు నేనొక్కన్నే కాదు
మా ఇలాక ఇలాకనే పూరా పచ్చని శీర కట్టుకొని
కోయిల పాటతో సంబుర పడతది
మాగి చలి ఎండలతో మస్తుగ జబర్దస్త్ జేస్తది
మూడాల కాలం అయిపోయి
పెండ్లిండ్లు – కొత్త ఇండ్లల్లకు వచ్చుడు షురూ అయితై
జరూర్ గా ఉగాది తోనే మాకు మంచి రోజులత్తయ్

ఇగో, ఇప్పుడు నేను కాల గ్యానం సెప్తాన
అచ్చరం ముక్క ఇడ్సకుంట రాస్కో
సరిత్ర పాటాలల్ల
*"క్రీస్తు ముందు... క్రీస్తు తర్వాత"* అని అంటరు గదా
గట్లనే, రాబోయే రోజులల్ల
నా సరిత్ర గూడ
*"తెలంగాణా ముందు... తెలంగాణ తర్వాత"* అనే తీర్గ అయితది

గందుకనే, నా బోటి వాళ్లకు తెలంగానత్తనే
కొత్త సాలు వచ్చినట్టు...!

***(ఏప్రిల్, 2013 'నమస్తే తెలంగాణ' చెలిమెలో ప్రచురితం)***





# 14

## కట్ట మీద రాల చెట్టు !

చెర్వు కట్ట పొంటి పొయ్యేటోళ్ళందరు
ఒక్కటే మాట చెప్తరు
లింగు లింగు అనుకుంట
గా రాలచెట్టు ఒక్కటే ఉంటది అని..!

అవును, గంత పొడుగు కట్టమీద
ఆ కొస్స నుంచి ఈ కొస్సదాక
తలెత్తుకోని అందరికి కన్పిచ్చే చెట్టు అదొక్కటే!
కట్ట కింద మైలు దూరం దాక ఉన్న పొలాలల్ల నిలబడి చూసినా
కట్ట మొదుగాల మొరం బాట పొంటి చూసినా
గుట్టకు కలిసే కట్ట అటుకొస్సల నుండి చూసినా
గొర్ల కోసం, పండ్ల కోసం గుట్టెక్కి చూసినా
కండ్లకు కొట్టినట్టు కన్పిచ్చేది ఆ చెట్టొక్కటే !



నా బడిదినాల సంది
ఆ రాలచెట్టు నాకొక పెద్ద గమ్మతి
దూరం నుంచి చూస్తే అరచేతంత ఉంటది
దగ్గరకు పోతాంటే వందమనుషుల ఎత్తుల
వేలమంది వెడల్పుల బౌపెద్దగ కన్పిత్తది !

గా రాలచెట్టు నాకు మొదటి రాగాల గురువు –
గుట్టమీద నుంచి, పొలాల నుంచి రువ్వడి మీద వచ్చే గాలి
గా చెట్టు ఆకుల సందులకెళ్ళి వంగి వంగి ఉరుక్కుంట
చిత్రమైన సంగీతాన్ని ఇన్పిస్తది !

గా పెద్ద చెట్టు నాకొక Dance Master –
చిటారు కొమ్మలు లయబద్ధంగ కదులుతూ
ఒక కొమ్మను మరో కొమ్మ, ఒక ఆకును మరో ఆకు
తాకుతూ విడిపోతూ,
ఓ మహా బృంద నాట్యాన్ని తలపిస్తది...!

గంతేనా –
ఊళ్ళె ముత్తైదువులు – పెండ్లి కాని ఆడబిడ్డలకు
గా చెట్టే వరాల దేవత !
ప్రతి కార్తీక పున్నమికి
కాండం మీద పసుపు కుంకుమ బొట్లతో, కొబ్బరికాయలతో
వేళ్ళ చుట్టు మట్టి నేల మీద రంగురంగుల ముగ్గులతో

బంతి, మందార పూల అలంకారాలతో
కట్ట మైసమ్మ అవతారం ఎత్తుతది..
సెలవులల్ల బైటి వంటకు వచ్చే కుటుంబాలకు అన్నిటికీ
వెలుగు దివిటీయై, చల్లని నీడై, అమ్మ ఒడిలా కనబడ్తది..!

ఊళ్ళె పంచాయతిలకు
గొర్లు, బర్లు దూపతీరినంక సేద తీరడానికి,
ఎండల్ల నీడను, వానల్ల నిలువచోటును
వందలమందికి ఇత్తది..!

ఇదంతా చూసినంక నాకు ఏమనిపిస్తదో ఎర్కేనా?
ఆ రాలచెట్టు కట్టమీద ఒక్కటే నిలబడి
మా ఊరి జనాలందరి తరుపున
దేవున్ని శనార్తి వేడుకుంటున్న యోగిలెక్క అన్పిస్తది...!

అయితే, మీరంత అన్నట్టు రాల చెట్టు ఒంటరే –
అయితేంది,
మా ఊరుఊరుకే పెద్దదిక్కై నిలబడ్డది !
ప్రతి చెట్టూ ఒంటరే –
అయితేంది –
లోకానికంతటికీ పచ్చని రంగులు అద్దుతూ
పెట్టని కోటై మనల్ని గెలిపిస్తది...!!

***(2 ఫిబ్రవరి, 2008)***

# 15

## మట్టి చెక్కిన శిల్పం!

అతను –
ఈ లోకంలో
మనిషి అడుగులను
ఆకుపచ్చని ముద్రలుగా వేసినవాడు !
మొక్కకు
రెండు చేతుల ఆకులను
కాండపు దేహాన్ని – పండ్ల గుండెలను
నిండు పూల ముఖాన్ని ఇచ్చినవాడు!

చినుకు ముచ్చట్లు
గందుకే అతనికి ఒక్కనికె బాగా మనసున పడ్డయి!
తల ఎత్తి మబ్బుల దిక్కు ఆశగ చూసి
వానలు పడాలని పూజలు చేసి

కప్పలకు పెండ్లిండ్లు చేసి
ఆడబిడ్డలకు బట్టలు పెడ్తడు !
నీటి జాడలను ఎంకులాడుకుంట
పాతాళ లోకానికి రువ్వడిగా ఉర్కుతడు !
నీళ్లకు నడకలు నేర్పి... సాలుతీసి... గట్టువేసి
కాలువలు చేసి పారిస్తడు!

విత్తనం శక్తి
అతనికి ఒక్కనికే బాగా తెల్సు !
గోరంత ఇత్తును
హనుమంతునంత చేసే మంత్రం అతనికి వచ్చు !
సోమరిగా ముడ్చుకొని పడుకున్న దానికి అలజడి నేర్పి
అణచివేతల పొరలను చీల్చుకొని
పైకచ్చి తలఎత్తే తెగువను ధారపోస్తడు!

భూమిని బుదుగరిచ్చుడు
అతనికి ఒక్కనికే బహు బాగా తెల్సు!
భూమిని దున్ని బురద చేసి నాట్లు వేసి కావలి కాస్తడు
ఆరుగాలం పంట చుట్టూ పానాలు నిలుపుకొని
పంట పండిచ్చి, కోసి, నూర్చి,
తూర్పార బట్టి, బస్తాలల్ల నింపి
అటెన్క లోకం కడుపు నింపుతడు...!



మూగ జీవాల బాస
అతనికి ఒక్కనికే బాగా వస్తది!
గొర్రెలను మేకలను మేపుతూ
తన పొలాన్ని వాటి ఆటస్థలంగా మారుస్తడు
అడవి పొంటే ఉరికే ఎద్దులను
గడ్డి గాసం యేసి మాలిమి చేస్కుంటడు
ఎల్పటి రామన్న... దాపటి లచ్మన్న మెడల మీద కాడెత్తి
ముల్లుగర్రతోని పొడిసినందుకు
రాత్రంత నిద్ర కాసి దు:ఖ పడ్తడు!

తోటి మనుషుల గోస
అతనికి ఒక్కనికే సక్కగ సమజ్ అయితది!
అందుకే....
నాగలి... కర్రు... గడ్డపార ... మోట తిత్తి
సామాన్లెన్నో సూపిచ్చి
వడ్లోల్లకు, కమ్మరోళ్లకు, చర్మ కారులకు పని ఇత్తడు
తట్ట... చాట... గోనెసంచి... గుమ్మి
అవసరాలెన్నో సూపిచ్చి
మేదరోళ్లకు చేతి నిండ పని పెడ్తడు
ఊరందరి పొయ్యిల వంట కోసం
పసుల పెండను గోడమీద పిడకలెక్క మారుస్తడు
జనం అందరి కడుపుల మెతుకుల కోసం
తానే ఇత్తనమై మట్టిల కల్సిపోతడు!

అతడు, భూస్వామి కాదు... ఆసామి!
బతుకు... బతికించు... న్యాయాన్ని నమ్మిన పురోగామి
వ్యవసాయం చేసేందుకు
వ్యవస్థకు సాయం చేసేటందుకు
ప్రకృతి పుట్టించిన పదకొండో అవతారం!

అతను...
సూర్యుడు అల్లిన వస్త్రం...
మబ్బు దిద్దిన చిత్రపటం!
గాలి పేర్చిన భవనం...
అగ్ని కాల్చిన ఆభరణం!!

అతను
చినుకు అలికిన ముగ్గు...
మట్టి చెక్కిన శిల్పం...!!


*(నమస్తే తెలంగాణ దినపత్రిక 'చెలిమె' పేజిలో ప్రచురణ జూన్ 2017)*

# 16

## మా ఊరి పురాణం

ఇంటింటికో మంటి పొయ్యి
ఊరూరుకో చరిత్ర
మట్టి పొరల కింద వెదుకుతావేమో
అక్కడ కాదు–
జనం గుండెలని అలుముకొని చూడు
ప్రజల సామూహిక స్మృతుల శిథిలాలను తడిమి చూడు...!

ఊరి పేరు పేరుకో పురాణం
మైలురాయి మీది అచ్చరాలల్ల
పురావస్తు పరిశోధనలల్ల దొరకదు
మూడు తరాల గతాన్ని తవ్వ
ముసలోళ్ల ముచ్చట్లు విను... !





ఊరు పొందుబాటు గావాల్నంటె
ఎన్ని ఇగురాలుండాలె
ఊరు అనేది
తిరిగే సారె మీంచి మొలుసుకచ్చే కుండ
కొలిమిలో ఇనుమును కరిగించి చేసే నాగలి కఱ్ఱు
భ్రమణ పరిభ్రమణాల తండ్లాట తర్వాత
నేల మీద  పొడిసే సూర్యుడు
మబ్బుల మధనంలోంచి జారిపడే చినుకు
రైతు చేతుల కాంచి దిగి వచ్చే ఇత్తనం

ఎన్కట ఇదంతా ఓ అడవి
లేకపోతె ఓ పడావు పడ్డ భూమి
జనం పాదాలు
మట్టితో సంభాషణ మొదలు పెట్టిన సందే
పచ్చని చెట్లు కూడా కళకళ లాడినై
జనం వచ్చినంకనే ఈ నేల
జొన్న కంకుల తోట లెక్క నిండుగ నవ్వింది !

ఇగ, ఒక్క సారి మా ఊరి మొఖాన పోదామా –
మాందారిపేట మలుపు తిర్గంగనే
మా ఊరి వరి చేనుల వాసన
అమ్మ పురిటి పరిమళాన్ని తీసుకత్తది
గుంటలు పడ్డ డాంబర్ రోడ్ మీదినుండి
రంగనాయకుల బోడు దాటి
బీసీ కాలనీల ఇండ్లు కండ్లపడంగానే



ఊరు గడపలకు వచ్చినట్లనిస్తది
దావఖానా దాటి, పెద్ద బడి దాటి
పోలీస్ ఠాణా  దాటి, పంచాయతీ ఆఫీసు కాడికి రాంగానే
అక్కడి ఐలమ్మ విగ్రహం – దాని పక్కన సెల్ టవర్
మా ఊరు ఆత్మను ఎర్కజేత్తయ్
అస్తిత్వ సోయిని – ఆధునికత తీరుని
బాండు పేపర్ మీద రాసి మరీ ప్రకటిస్తయ్
రామసక్కదనాల జలతారు – మా ఊరు !

మా ఊరు నిత్య చైతన్య శీలి !
లోకానికి తగ్గట్టు, కాలానికి అద్దినట్టు
ఎప్పటికప్పుడు మారుకుంట వస్తాంది
దశావతారాలలో తొలి అవతారం గుడి ఉన్నందుకేమో
నిరంతరం చలన శీలమై, చర్యాలోలమై
తనని తాను మార్చుకుంట
"యుక్తతమముల సార్థక జీవనము" సాగిస్తోంది
ఊరి సుట్టూ కొలువైన ఐదు చెరువుల్లో
సీత కుంటను పోగొట్టుకున్నా
మిగిలిన చెరువులనే
ఊరికి నాలుగు స్తంభాలుగా నిలుపుకొన్నది !

మా ఊరు కర్మ యోగి–
పోయిన దాని మీద చింత లేదు !
వచ్చేదాన్ని ఆపడమూ  తెలియదు !!

మా ఊరు–

Darwin కు కూడా అందనంత పరిణామ పథగామి !
మట్టి గుడిసెలు, పెంకుటిడ్లు
డంగు సున్నం, ఇటుకల ఇండ్లు
కాంక్రీటు పిల్లర్ల ఇండ్లు...
ఒక్కంత్రం, రెండంత్రాలు, మూడంత్రాలు
ఇట్ల కాలానికొక్క తీరుగ మారింది
కచ్చురాలు, మొద్దు బండ్లు, నాగండ్లు
కార్లు– ట్రాక్టర్లుగ మారినై
మొగ్గం గుంటలు, కట్టె మొగ్గాలు –
పవర్ లూమ్ లుగా ఎదిగినై
భీమండి, సూరత్ ల రైలు ప్రయాణాలు దారి మార్చి
అమెరికా, ఆస్ట్రేలియా దిక్కుగా
కలలకు రెక్కలు కట్టడం షురువైంది !

మా ఊరు శాయంపేట
ఎన్ని సార్లు తల్చుకున్నా తరగని ఊట !!
దూప అయినప్పుడల్లా నేను ఎనుకులాడే చెలిమె
దిక్కు తోచనప్పుడల్లా
నాలో సూర్యున్ని రాజేసే కొలిమి
మనసుకు ఆకలైనప్పుడల్లా
ముడి విప్పే జ్ఞాపకాల సద్ది మూట
కండ్లు నెత్తికెక్కినప్పుడల్లా
యాదికచ్చే బాపమ్మ మాట



అగులు బుగులు అయినప్పుడల్లా
నాకు దారి చూపే బోధి వృక్షం
బతుకు కింద మీద అయినప్పుడల్లా
నన్ను దగ్గరికి చేర్చుకునే మాతృ వక్షం

మా ఊరంటే –
నా జీనోమ్ మ్యాప్ కథ
నా ఏడేడు తరాల పురా గాథ !

*(12 జూన్ 2017 'మన తెలంగాణ' దినపత్రిక 'కలం' పేజీలో ప్రచురితం)*

# 17

## 'మావో'న్ని మాయం సేసినంక ....

ఎన్కట తెల్లోల్లు
గిదేందన్నందుకు నాల్కల్జీరి నడ్డిర్శిండ్లని
నీకు జెప్పినప్పుడు, బిడ్డా నువ్వేమన్నావ్?
గీ నల్లోల్లు గూడ గదే బాపతని
తోలు తోలు కలువంగనే గాళ్లు మనోళ్లు గాదంటివి
నువ్ గయ్యాల జెప్పింది గిపుడు సమజైంది బిడ్డా!

❀ ❀ ❀

పెద్దోల్లను గదేందన్నందుకు
తెల్లారగట్లల్ల
తండాలోని పోరగాండ్లను చెర్లపీన్గల కింద సేసినంక
"అయ్యా! మనకెవ్వలద్దె



గా ఎర్రన్నలద్దు, గీ పోలీలసన్నలద్దు
మనకు మనం గావాలె
మనలను మనమే కాసుకోవాలె' అని నువ్ జెప్తాంటె
గా ఎర్రన్నలే మనోల్లని
నీ సోపతి గాల్లందరన వట్టిరి
గప్డు, నువ్ నాల్కె ఇప్పకపోయినా బాగుండె
నుప్పు మీది ఉప్పోలె, అగ్గోలె
నువ్ బగ్గు బగ్గున మండి
"గివీల్లంతా ఎర్రదొంగలు
పెద్దకులం గబ్బుకొట్టే ఎర్రి నాగన్నలం"టివి
గరీబోల్ల గుడిసెల మీద బాపనతనాన్ని, బాంచరికాన్ని
వానజల్లోలె కురిపిత్తాండ్లని
మన కట్టాలకు గాళ్ళ వకాలత్ ఏందని నిలదీత్తివి

❀ ❀ ❀

నువ్వడ్గుతాంటె గాళ్ళకు
ఎర్రటి ఎండల నిలవెట్టి
సుర్రుమనె సలాకు సురుకు పెట్టినట్టయిండాలె
బండెద్దు గాళ్ళ చేతుల పగ్గాలు దెంపుకపోతాందని
అగులు బుగులు అయిండాలె
నాకొడ్కా, సూసి సూసి నిన్ను మాయం సేత్తిరి,
పాపిట్టోల్లు
రామున్లెక్క ... !

శంబుకా, నా వరాలమూటా
గిప్పుడు మాకండ్లగమ్మిన 'ఎ(ర' పొరలు తెగిపోయినయ్ బిడ్డా
గియాల్దాకా గొ(రెల్లక్క ఎడ్డిగ నమ్మితిమి
ఇగ నమ్ముతమా
'పోయేదేం లేనోల్లం, అయ్యా, పోరు సేద్దాం రారా' అని
నువ్ జెప్పిన మాటల్ని మదిలవెట్టుకుని
మండె దివిటిల్లోలె గటువోతం

ఇక ఆగుతమా ...!?

('శంబుక' యాదిల ...)

*('ఆం(ధభూమి' దినప(త్రిక ఆదివారం అనుబంధం*
*మే 1995 సంచికలో (ప్రచురణ)*

# 18

## Occupy హైద్రాబాద్!

చిన్నప్పుడు మా అవ్వ నాకు బువ్వపెట్టే యాళ్ళ-
ఆస్మాన్ ల యెల్లి పొయ్యే చందమామను సూపిచ్చేది
బడికి పోయి అచ్చరాలు సద్వుకునె యాళ్ళ-
మా సారు మన రాజధాని హైద్రాబాద్ అని ఇగురంగ
సెప్పెటోడు
గిన్నేండ్ల కాలంల సందమామ - హైద్రాబాద్ రెండూ
నాకు ఒక్క లెక్కనే అన్పిచ్చేటియి
ఇమానం లెక్కుండే రంగీన్ బస్సుల ముందు ఎర్రచ్చరాలతోని
"× హైద్రాబాద్" అని రాసున్న బోర్డ్ ను సూసినప్పుడల్లా
హైద్రాబాద్ మన రాజధాని అని మతిల కచ్చేడిది
ఉపాచికంల సద్వుకున్న హైద్రాబాద్ కత యాదికచ్చేది
కాకతీయుల ఇలాక గొల్లోల్ల కొండ యాది
కుతుబ్ షాల ముచ్చట - బాగోతవ్వ మొహబ్బతి
నైజాంల పురానా జమానా గిర్రున తిర్గేటిది

అక్కడక్కడ దొర్కిన వయ్యిలను సద్వినంక
తెలంగాణ పురాణంల హైద్రాబాద్ కత మంచిగ దెల్సె
గప్డు పురాగ సమజైందిరా రాజిగా,
హైద్రాబాద్ బర్ పూర్ హమారా ... సిరఫ్ హమారా అని !
మన చెమటల ఇటుకలతోని
మన నెత్తుటి కంకరతోని నిలబడ్డదని ఎర్కయిందిరా !
గప్పుడు, హైద్రాబాద్ మన రాజధానొక్కటే కాదు
మన దిల్ కా దడ్కన్ అని
దిమాక్ కా వచన్ అని ఎర్కయిందిరా ...!!

నేను గిన్నొద్దులు నా హైద్రాబాద్‌ల ఉన్నా... లేకున్నా
అయిందానికి కానిదానికి గా పొంటి నేను పోయినా... పోకున్నా
హైద్రాబాద్ నా తాతముత్తాతల తెహజీబ్ గదా
హైద్రాబాద్ తోన నాకు తరతరాల సుట్టీరికం ఉన్నదిగదా
గందుకనె, హైద్రాబాద్ ముచ్చట ఏది తెల్సినా
మనసు అగులుబుగులు అయితది
బత్కచ్చినోనికే హైద్రాబాద్ మీద గంత హక్కు ఉంటె
బత్కు ఇచ్చినోన్ని – నా బ్రతుకు అనుకున్నోన్ని ..
మరి నాకెంత పావురం ఉంటది ?

గందుకనే,
గిప్డు హైద్రాబాద్ మీన యెవ్వొ ఇకమతులు జేత్తాండ్లని తెల్తనే
నా రౌతమ్ సల సల మర్గబట్టే..

మన దేశంలకి పడమర దిక్కు కాంచి అంగ్రేజోల్లు అచ్చినట్లు
మన హైద్రాబాద్‌కు తూర్పు దిక్కునుంచిగా కుట్రబాజోళ్ళు అచ్చిరి
గాల్ల నేల మీద బతుకు లేక, మెతుకు లేక బత్కవచ్చిరి
కండ్లల్ల పానం పెట్కొని వచ్చిన గాల్లందరినీ
*"బిడ్డా, సల్లంగ బతుకుండ్రి – పానాలను నిలబెట్టుకొండ్రి"* అంటిమి

గిప్డు, గీ మంజీరా నీల్లుదాగి
గింతంత కండబట్టి కొవ్వు పెర్గంగనె
*"గీ హైద్రాబాద్ మాది –*
*మాతోనె గీ షహర్ హైటెక్ అయ్యిందని"* బుకాయించబట్టిరి !

గిదెక్కడి నాయంరా ... ఏడన్నా గీ లెక్క ఉన్నదా?
హైదరాబాద్ గాళ్ళకు సిరఫ్ రాజధానే
గనీ, నాకు నా గుండెకాయ !
గందుకనే, గిప్డు వడిసెల బట్టి హైద్రాబాద్‌కు గొర్రుగొర్రున
ఉర్కచ్చిన
మనోళ్ళు చలో హైద్రాబాద్ అనంగనే
గొంగడి భుజానేస్కొని–రుమాలు ఎగ్గట్టి సడక్ మీదికి దుంకిన
నిజాం కాలేజీ మైదానంలకు 'మిలియన్ మార్చ్'లల్ల
నా దిల్ కీ బాత్ ఇన్పిచ్చిన
సకల జనుల సమ్మెల
నా మన్ పసంద్ ఏందో రాయిపెట్టి కొట్టినట్లు సెప్పిన
అయినా, కుట్రబాజిగాండ్లు రోజొక్క కుట్ర సేత్తనే ఉన్నరు

గంటకొక్క గల్తీ లెక్క సెప్తనే ఉన్నరు
గందుకనే గిప్డు, ఇగ నేనే ఇంకొక్క సైరన్ మోగిత్తాన
జర మతి బెట్టి ఇనుండ్రి
Occupy Hyderabad...! Occupy Hyderabad...!! ★

గా దినంల కుతుబ్ షా
చెర్వులకి చేపల్లెక్క అందరు రావాల్నని కైత సెప్పిండట
గిప్డు నేను మన తెలంగానోల్లందరికి – నయా షాయిరీ చెప్తాన !
జడ్చర్ల –బాన్స్ వాడ – ఏటూరునాగారం – మహాదేవపురం
లక్సెట్టిపేట – వాజేడు –కుంట్లూరు – తిర్మలగిరి
ఏ ఉళ్ళె –ఏ పల్లెల ఉన్నోల్లైనా
మన హైద్రాబాద్ రాండ్రి ...
చాపల్లెక్క కాదు చిరుత పులుల్లెక్క రాండ్రి ...
వాగు పొంగి సల్లబడ్డట్టు –
మూడొద్దులల్ల బలాన్ని సూపిచ్చి
మల్ల ఎన్కకి ఉర్కనీకి కాదు
హైద్రాబాద్ రోడ్ ల పొంటి జులూస్ ల నడ్సనీకి కాదు
ఈడ కాలు బెట్టి నిలబడటానికి రావాలె
మన హైద్రాబాద్ ను మన తెలంగానోల్లతోనే నింపాలె
Occupy Hyderabad .. ! Occupy Hyderabad !

గిక్కడ, మన ముత్తాతల కాలం సంది
ఆరుగాలం మనం జేసిన యెవుసానికి పెర్గిన చెట్లున్నయ్
గా చెట్లకు కాసిన పండ్లున్నై .. పనులూ ఉన్నై
నీ కోసం ఇంతేజార్ చేసే కండ్లున్నై .. కదుపు నింపే కలలున్నై
చెర్ల చాపల్లెక్క కాదు – చాపకింద నీల్లలెక్క రాంఁడ్రి...
Occupy Hyderabad .. ! Occupy Hyderabad !

***(డిసెంబర్ 2011లో హైదరాబాద్ నగరాన్ని తెలంగాణ నుంచి విడదీసి కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించాలని పన్నుతున్న సీమాంధ్ర కుట్రలను గమనించి...)***

★ *అమెరికాలో పెచ్చురిల్లుతున్న ఆర్థిక అసమానతలకు మార్కెట్ శక్తులే కారణమని భావించి సామాన్య అమెరికన్‌లు సెప్టెంబర్ 2011లో ప్రారంభించిన నిరసనోద్యమం - Occupy Wall street! ఈ ఉద్యమ నేపథ్యాన్ని తెలంగాణాకు హైదరాబాద్‌కు అన్వయింపుగా వాడిన పదబంధం Occupy Hyderabad)*





# 19

## ఊరికి పోయిన యాళ్ల.....

1. ఊరికి పోవడం అంటే
'ఊరికే' పోవడం కాదు–
ఊపిరి కోసం పోవడం
తప్పని సరై తప్పక పోవడం కాదు–
గతి తప్పకుండా ఉండడం కోసం పోవడం
నగరం నదిలోని తెప్ప
దారి తప్పకుండా చూడడం కోసం పోవడం

2. ఊరికి పోవడం అంటే --
చిరిగిన నెక్కర్ లోని బాల్యాన్ని
గడీల బడి చూరులోంచి దిగిన సూర్యున్ని
పెద్ద బడి బాదం చెట్టు నుండి రాలిన  తరగతి పాఠాలని
ఒక్క సారి ఒడిసి పట్టుకోవడమే

మంచి నీళ్ళ బాయిలోంచి సోపతిగాల్ల జ్ఞాపకాలని
బొక్కెనల  కొద్దీ చేదుకోవడమే
మోదుగు చెట్టు ముదురు మట్టి ఎండుటాకుల్లోంచి
ఎండాకాలం సెలవుల వీరత్వాన్ని
మరొక్క సారి తడిమి చూడటమే...

3. ఊరికి పోవడం అంటే –
మంగలి సమ్మయ్య కత్తెరనీ – మేర మదుసూదన్ మిషిన్ నీ
తమ్మల్ల లచ్మయ్య డోలునీ – బోయ కమ్లమ్మ బీడీల గంపని
కంచరి రాజయ్య నిప్పుల కొలిమిని
కుమ్మరి ఓదెలు మట్టి కుండలని
శాల నరసక్క ఆసు కొయ్యని – సదానందం మొగ్గం గుంటని
సుంకరి సారయ్య చాటింపుని
కూనపెల్లి రామయ్య మార్కండేయ పురాణాన్ని
గొల్ల యాదగిరి గొర్రెల కొట్టాన్ని
ముత్రాసి కాంతమ్మ చాపల బండని
మాదిగ సాయిలు డప్పు సప్పుడుని
పక్కీరు సాయెబు నెమలీకల కట్టని
తెనుగు శంకరి బొంబాయ్ మిటాయ్ని
కాపు యాదగిరి గడ్డి వామిని
సాంబయ్య సైకిల్ ట్యాక్సీని
గుడిసె రామసామి గుర్రం టాంగా ని
తుర్క రబ్బానీ మాము ఆటోని
గవుండ్ల రఘు బాబాయ్ జీపుని...
మడతలు పడ్డ మస్తిష్కం లోంచి మళ్ళీ వెలికి తీయడమే

4. బాల సంత శంకరయ్యఊదిన శంఖు నాదాన్ని వింటూ
పూసబెర్ల మల్లమ్మ గంపలోని మొలతాడు దారాన్ని కొంటూ
పంబాల రాజనర్సు జమిడీక సప్పుడుని తడుతూ
పట్వారి పాపిరెడ్డి పట్టా బుక్కులని చూస్తూ
మత్స్య గిరి గుడి శిఖరం మీది మైకు లోంచి
వేకువ జాము గాలుల్లో తేలి వచ్చే
*"పడవెల్లి పోతోందిరా... ఓ మానవుడా"* పాటలనిపాడుకుంటూ
దేవుని చెరువు కట్టను మళ్ళీ దాటడమే...!

5. అడుగు పెట్టీ పెట్టగానే
ఊరి మట్టిని దేహం నిండా పులుముకుని
ఆ మట్టి బురదని అత్తరులా అంగీపై చల్లుకొని
లుంగీని ఎగగట్టి ములుగర్రను చేతిన బట్టి
దుక్కి దున్ని- మడులు గట్టి- మట్టి అడుగున దాగి ఉన్న
నా ఊరి జ్ఞాపకాలను తవ్వి పోసి
వాటిలో వర్తమానం వరి మొక్కలను నాటుతాను !

6. నేనిప్పుడు నిలువుగా ఎదిగిన చెట్టుని
మబ్బుల దాకా ధ్వనిస్తున్న ఆకు పాటని
చిటారు కొమ్మల్లో కూచుని ఉన్నా
చెట్టు వేళ్ళ లోకే ఒలికి పోతాను
మట్టి మూలాలలోనే ఒదిగి పోతాను
పెరిగి పెరిగి - తిరిగి తిరిగి - కరిగి కరిగి- జరిగి జరిగి

పాదాలతో కొలతలు మొదలెట్టిన నేల పైకే
మళ్ళీ వస్తాను
Doller Tsunami కి చెల్లా చెదురై
చెదిరి పోయిన ఇసుక గూడుని పదేపదే నిర్మిస్తాను
మళ్ళీ ఊరికే వస్తాను
మళ్ళీ మళ్ళీ ఉరికురికి వస్తాను

7. ఊరికి రావడం అంటే
'ఊరికే 'రావడం కాదు–
Bus Pass, Pass Port, Visa లను Renew చేసుకున్నట్లు
నా Identity ని మళ్ళీ పొడిగించుకోవడం...!
పొగ చూరిన ఊపిరి తిత్తుల నిండా
తంగేడు పూల వాసనని మురిపెంగా నింపుకోవడం ...!

***(24 మే, 2014)***





# 20

## ఊరు బతుక బోతాంది...!

1. పచ్చని పొలాలు - తీరొక్క పంటలు
ఏరువాక పున్నాలు - బైటి వంటలు
గొబ్బెమ్మలు - దసరా పిల్ల నెత్తురు బొట్లు
ఎల్లమ్మ గుడి కాడ గణపయ్య మట్టి బొమ్మలు
తాళ్ళ కుంట చెర్వుల కలువ పువ్వుల దేవులాటలు
పెద్ద బడి మైదానంల సాధనాసురుల మాయలు
అమాస బజార్‌లల్ల దీపాల ముసి ముసి యెలుగులు
సకినాలు- సత్తు పిండి -కుడుములు - బచ్చాలు
వడ్ల గుమ్మిలు- గంజి కూరాళ్ళు
సద్దన్నం- చింతకాయ తొక్కు
ఎఱ్ఱ మన్ను అరుగులు
గడపలల్ల ఎదురు సూపులు



వాకిట్లల్ల ముగ్గులు
ఆషాఢంల బోనాలు
ఆశ్వయుజంల బతుకమ్మలు-
గిది ఒకనాటి మా ఊరు !

2. పెద్ద సద్దుల కోసం కొడ్కులు బిడ్డలు అందరూ
పట్నం తొవ్వ బట్టిరి
సెల్వులల్ల గాల్లంత ఊళ్లెకి తిరిగి అచ్చినపుడు
మా ఊరు ఊరంత కల కల లాడేది !

3. వాడలన్ని తిరిగి తిరిగి
సీత కుంట కట్ట మీద దువ్వెనలను పట్టి
నెత్తి మీదంతా మట్టి నింపుకుని
కడుపుల ఆకలి పుట్టినపుడు ఇంటికచ్చి
తల్లి కొంగు లోపలికి ఎగ బాకిన బుడ్డోడి మొకం-
గాళ్ళ మొకాలల్ల యాదికచ్చేది
తల్లి పిల్లల్ని దూరం సేసిన సద్దుల మీద గుస్సా పెరిగి
"నీయవ్వ, గీ సద్దులు సద్వకుంటే మాయె పో"
అని గుసగుసలు పోయేటిది
గందుకే, ఇంటికచ్చిన బిడ్డల్ని బౌ పావురంగ సూసేడిది

4. ఊళ్ళె పోరగాల్లకు గా రోజులల్ల
బడి పంతులు - పోలీసు ఉజ్జోగాలు అత్తెనే
గవాళ్ళ అయ్యవ్వలు సుక్కలు సూసేటోండ్లు

బియ్యాడీ సద్వీన రమణయ్య సైకిలెక్కి
పక్క ఊళ్ళెకి పంతులు పనికి పోతాంటే
కాడెత్తుకున్న మల్లయ్య - గొర్ల తోలుతున్న రాజయ్య
కలుపు తీస్తున్న కనకవ్వ - నీళ్ళు పెడ్తున్న నారక్క
చెర్వు కట్ట కాడ సంబ్రంగా సూశేటోల్లు
ఎన్నో దినాల్నుంచి
గాళ్ళు కంటున్న కలలు పండినై అనుకునేటోల్లు

గిదంతా గియ్యాల ఓ కాలం నాటి మాట అయింది !

5. గిప్డు --
ఊళ్లెకి టీవీలు - ఫోన్లు- సైకిల్ మోటర్లచ్చినై
పోరగాండ్లు గీమాలి గీమాలి ఇంజనీరు సద్వీండ్లు
పెద్ద పెద్ద పట్నాలల్ల కంపూటర్ ఉజ్జోగాలు సేత్తాండ్లు
లచ్చల రూపాలు సంపాయిత్తాండ్లు
గాళ్ళ ఇండ్లల్ల సెల్ ఫోన్లు- కార్లచ్చినై
అయ్యవ్వల ఇష్టైల్ ఏక్ దమ్మున బదల్ అయ్యింది
గుడిసెలు పోయి బంగ్లాలు- గోసి పోయి పైంట్లచ్చినై

6. సూత్తాంటే సూత్తాంటేనే ఊరు-
పట్నం రంగు పూసుకునుడు
పట్నం బతుకు మీద
కతలు కతల్లెక్క సెప్పుకునుడు షురూ జేసింది
గక్కడి రాస్తాలు- బంగ్లాలు- సిన్మా హాళ్ళు
హోటల్లు - దుకాణాలు - రాత్రిపూట ఎల్తురులు
కచ్చీరు యాప చెట్టు కింద ముచ్చట్లైనై.

పంచాయితీ ఆపీసు దగ్గర
పట్నం బతుకు రాజ బోగం లెక్క ఉంటదని
ఒకల్ని మించి ఒకలు సెప్పుకునుడు ఆదత్ అయ్యింది
గక్కడి ప్యాశన్లు- బిర్యాని- సమోసా- ఐస్ క్రీములు
గుట్టంత ఎత్తుండే షాపులు - వాటిలోని ఏసీలు-
జిగిల్లని మెరిసే రంగీన్ లైట్లు
బూమ్మీద సర్గం వోల్గే కనిపియ్యబట్టే
పట్నంల పుట్టినోని బతుకే బతుకని
ఎన్నో జన్మాల పున్నెం తోనే పట్నం పుటక వత్తదని
అందరు ఒక్క చిత్తానికి వత్తిరి..!

7. గీ ముచ్చట్లన్నీ ఇన్నంక
గీ సంగతులన్నీ కండ్లతో సూసినంక
అందరికీ ఒక్కటైతే సమజయింది
"గీ ఊరు బతుకేందిరా బై
బతికితే పట్నంలనే బతకాలె
గక్కడి రాస్తా మీద నడుత్తాంటేనే కడుపు నిండుతది
మనూల్లె ఏం పాడు వడ్డది
పంది  లెక్క గీ ఊళ్ళే పది దినాలు బతికేదాని కంటే
నంది లెక్క పట్నంల నాల్గు దినాలు బతికినా సాలదానే"

8. గియ్యాల మా ఊళ్లె అందరు అయ్యవ్వలు
గాల్ల పోరగాల్లను
"పట్నంల ఏదన్న పని సూస్కోరాదు కొడ్కా"
అని సాగతోలుతాండ్లు...

***(5 జూన్ 2007)***



# 21

## పండుగ

పండుగత్తాందంటె సాలు
దునియాల లేని హైరానంత పడ్తడు
మా నాయ్న ...
అది
సద్దుల బత్కమ్మ – దసరా – దివిలి
సంకురాత్రి – ఉగాది – వినాయకచవ్తి
ఏదన్న గానీ ...

కండ్లల్ల పెట్కొని పెంచిన పిల్లలంతా
రెక్కలొచ్చి ఎగిరిపోయినంక
గిప్ట ఒక్కడే
తెల్లార గట్లల్ల నుండి
పొద్దు గుంకి చీకటి పడే దాక

అటు తిర్గి ఇటు తిర్గి
ఊళ్ళెకు వచ్చే పత్రికల్ని సద్వి
పెద్దోడు తెచ్చిన రంగీన్ టీవీల
సిన్మలు సూసినంక గూడ
దినం గడ్తలేదని
ఇంటిముందు పందిరి కింద నీడల్ని తిడ్తుంటడు!

అట్టాంటి నాయ్న
పండుగత్తాందంటె సాలు
అది తేవాలి ఇది తేవాలని
'చికున్ గున్యా' కాళ్లని ఎగరేస్కుంట ఉర్కుతడు!

మొన్ననే మా ఊళ్లెకి వచ్చిన
రూపాయి ఫోన్ డబ్బాల్నుంచి
బిడ్డలు అల్లుల్లతో మాట్లాడి
'బిడ్డా! పండుగత్తాంది
ఊరికి రాంగ్రి' ! అని పిలుత్తడు

ఇగ
బిడ్డలందరచ్చి ఇల్లలికి ముగ్గులు పెట్టి
అరిశెలు–బచ్చాలు–పూరీలు–కోడికూరలు చేత్తాంటె
'ఇంట మీ అమ్మున్నట్టె ఉన్నది బిడ్డా'! అని
మాకు కన్పించకుండా
కండ్ల నీళ్లు పెట్టుకుంటడు

చిన్న 'చిక్కి'గాడ్ని ఎత్తుకుని
సిన్మా టాకీసు కాడికి తీసుకుపోయి
నిమ్మ చిల్కలను కొనిచ్చి
'మా మన్వడు' అని ఊరంత తిప్పుతడు

సూత్తాంటె సూత్తాంటెనే
సెలవు దినాలు గడ్సిపోతై
ఒక పొద్దు
'నాయ్నా! మల్లత్తం'! అని
సందుగలు సంచీలు సదురుకొని
ఎక్కడోల్లు అక్కడికి పోతరు
'గట్లనె బిడ్డా'! అన్చెప్పి
బొడ్రాయి దాకా వచ్చి అందర్ని సాగదోలుతడు

ఇంటికి తిరిగచ్చి
సడీసప్పుడు లేని అర్రలని చూశి
నడింట్ల అమ్మ పొట్వ దగ్గర
సగం కాలిన అగరుబత్తులను చూశి
ఎండిపోయి నెర్రెలు బారిన పొలాన్ని సూసిన రైతు లెక్క
బెంగటిల్లుతడు

గందుకనే
ఎప్పుడూ దేవున్ని మొక్కని మా నాయ్న
పండుగలు జల్దిన రావాల్నని
గిప్పుడు మొక్కుకుంటడు ... !

*(27 మే, 2007 'ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం'లో ప్రచురితం)*



# 22

## పచ్చడి, బచ్చం... మా బంగ్లా...!

ఉగాది అనంగనె, శానా మంది
కోయిలపాట – పచ్చని వసంతం అని
ఎవ్వెవ్వో ముచ్చట్లను కైకడ్తరు
కనీ, మాకైతే ఉగాది అనంగనె
మా బంగ్లా యాదికత్తది!

మా బంగ్లా ఓ ముసలి బాపమ్మ
డంగు సున్నం గోడలు – టేకు కట్టె కడీలు
వాటి మీన పాలాస్త్రి ఇటుకలను పేర్చి కట్టిండ్లు
ఆ కాలంల మాదొక్కటే రెండంత్రాల బంగ్లా
మా తాత కాలంలనె అది కట్టనీకి
పదేండ్లు పట్టిందట
గీనాటికి అది ముసలిదైపాయె

బంగ్లా బంగ్లంత సీకటి పడ్డట్టాయె
పడావు పడ్డ పొలంలెక్కాయె!

ఐతెమాయెగనీ, ఈ ఉగాది దినంల
మా బంగ్లా పెద్ద తలుపు దర్వాజలు
మామిడాకులను చెంపసేరులెక్క అతికిచ్చుకుంటయ్
పదారు గడపల పాదాలు పసుపు పూసుకొని
నిండు ముత్తైదులెక్క షానీ గొడ్తయి
ఇంట్లో పర్శిన షాబాదు బండలు
నీళ్లతో మొఖాలు కడుక్కున్నట్టుగ
అద్దాలెక్క మెరుస్తయ్

బంగ్లా మీది కెళ్ళే మెట్లు
ముగ్గుల హారాలను మెడలో దిగేసుకున్నట్టుంటయ్
పెరట్ల బాయి గోడలు కుంకుమ బొట్లు అద్దుకుని
లేని కండ్లను అతికిచ్చుకున్నట్టుంటయ్
కోతుల ఎగురుడుకు
యాప చెట్టు పూత అంత రాలిపోయి
నేల మీన పూల అలుకు సల్లినట్టయితది
పొయ్యి కింద మండుతున్న పొర్క
'చిట్ పట్'మనుకుంట
మా కడ్పుల పేగుల గోసని ఇన్పిత్తయ్

మోకాళ్ళ మీద కూకున్న మా అమ్మ
పూర్ణాన్ని రొట్టె నడిమిట్ల పెట్టి
గాజుల చేత్తో ఒత్తుకుంట
పెనం మీన ఏత్తది
'సుయ్యి' మనుకుంట బచ్చం
మా సూపులను గుంజుకోని
మా ముందటున్న పల్లెంలకు ఎగిరి అత్తది!

సకులం ముకులం పెట్కోని పీట మీద కూసుంటం కదా
ముందటున్న పల్లెం పక్కన
ఇత్తడి గిలాస ఇగురంగ అచ్చి చేర్తది
గిలాస నిండ చింతపండు – బెల్లం సాక
దాంట్లె తేలుకుంట మునుక్కుంట
యాప్పూత–పచ్చి మామిడి కాయ ముక్కలు...
బచ్చం తినుకుంట–పచ్చడి తాగుతాంటె
అప్పుడు కడుపుల కోయిల కూత్తది!
మొఖంల వసంతం ఎగిరెగిరి దున్కుతది!!

ఒరేయ్ దిగులు మొఖపోడా,
మా బంగ్లా సాచ్చిగ చెప్తాన ఇను–
వసంతం మనతాన్నే ఉంటది!
కోయిల మనలోనే ఉంటది!
కొత్త చిగురు మనకోసమే ఏత్తది!
ఉగాది మనకోసమే వత్తది...!

*(ఏప్రిల్ 2006)*

# 23

## పట్నం పెద్దమ్మ అసొంటిది

ఇంతకాలం నువ్వు చెప్పుకుంట వచ్చినవ్
పల్లె తల్లి అసోంటిదని – పట్నం పరాయిదని!
కానీ, హైదరాబాద్‌ని సూసినంక సమజయింది
పరాయిదో... ప్రేయసో కాదు
పట్నం పెద్దమ్మ అసోంటిదని...!

నాకు రెక్కలచ్చి
నేను పెద్ద పెర్గినంక
గూడు సిన్నగయిందని గుర్తుపట్టి
నా పల్లె తల్లి నన్ను ఇడ్వలేక ఇడ్వలేక
ఊరి బొడ్రాయి దాక వచ్చి సాగతోలింది
అప్పుడు – హైదరాబాద్ నాకు 'అలాయ్ బలాయ్' ఇచ్చింది
నా చిన్నప్పుడు తాతీల్‌కు
అమ్మమ్మ ఇంటికి వచ్చినట్టు అన్పిచ్చింది!

గీ పట్నం ఏమేం జేసిందో నీకు ఎర్కేనా –
రెక్కవిరిగి – గాయపడి – రక్తమోడి – బొక్కల పీన్గ లెక్కయి
కడుపు లెండుకపోయిన నా తోటోళ్ళందరికీ
ఈ షెహర్ కూడును, గూడును, గుండెను బీ ఇచ్చింది
చాయ్–బన్నును, బిస్కెట్–బిర్యానీని ఇగురంగ బెట్టింది
నా తెలివికి పదును పెట్టి – నా పెన్నుకు వన్నె తెచ్చింది
ఏక్ దమ్మున జెప్పాల్నంటే–
జాబ్‌నిచ్చింది – జేబు నింపింది – జిందగీనిచ్చింది!

హైదరాబాద్..... హైదరాబాద్ –
నువ్వు ఈ జమీన్ మీన వాలిన చాంద్ కా టుక్‌డా!
ఈ దునియల నిల్సిన సూరజ్ కా ముఖ్‌డా!

నువ్వు – మా దిల్లుల పెద్దమ్మ నిషాన్‌వి
మా దడ్కన్‌ల తెలంగాణ షాన్‌వి....!

*(2016 'సాక్షి' దినపత్రిక హైదరాబాద్ ఎడిషన్‌లో ప్రచురితం)*





# 24

## పిట్టని దేవులాడిన గూడు!

1. ఇత్‌నా బడా షహీన్ షహర్‌ల ఇల్లేమీ లేనివాణ్ని
అడ్రస్ అంటూ లేనివాణ్ని
కాందిశీకున్ని.. శరణార్థిని
నిత్య యాత్రికుడ్ని... నిరంతర సంచారిని

2. యుగాల క్రిందటెపుడో
నాకూ ఓ గుహ ఉండేది
తొలినాటి నా ఊహలని చిత్రించి
బలహీనతలని దాచుకోవడానికి
భయాలని రాళ్ళకింద పాతిపెట్టి
వాన, చలి, ఎండ నుంచి కాపాడుకోవడానికి
మనిషి – మృగం నుంచి పారిపోయి
నా ఉనికికి చిగుళ్ళు తొడగడానికి
నాకూ ఒక గుహ ఉండేది



3. శతాబ్దాల క్రితమెపుడో
నాకూ ఓ గూడు ఉండేది
గోడు చెప్పుకోడానికి
'దిగుడు'లో దిగుళ్ళ దీపం వెలిగించి
చిలక్కొయ్యకు కన్నీళ్ళ అంగీని ఆరేయడానికి
'సూరు'లో చిరునవ్వుల విస్తరాకును చెక్కి
పొయ్యి కింద కట్టెల్లో బతుకు మెతుకులను రాజేయడానికి
నా అస్తిత్వానికి గుడికట్టడానికి
నాకూ ఓ గుడిసుండేది

4. దశాబ్దాల క్రిందటెపుడో
నాకూ ఓ ఇల్లుండేది
క్యాలెండర్‌లో ఉద్వేగాలని వేళ్ళాడదీసి
బీరువాలో ఉత్సాహాలని భద్రపరచడానికి
టీపాయ్ మీద ఉత్తేజాలను Flower-vase లా పరచి
గోడ రంగుల్లో అనుబంధాలను అద్దడానికి
నా ఆత్మగౌరవానికి రెక్కలు తొడగడానికి
నాకూ ఓ ఇల్లుండేది.

5. ఇపుడదంతా ఓ యాది.... ఓ జ్ఞాపకం..... ఓ Nostalgia
నాలుకకీ నాభికీ మధ్య నిరంతర వలస
మొదటి అక్షరానికీ – చివరి వాక్యానికీ మధ్య
అలుపులేని ప్రయాణం

6. ఇపుడేమో –
గుహ మతిలలేకుండ పోయి
ఆదిమ పేగుబంధం తెగినట్లయింది
గుడిసెను యాది మర్సి
గుండెను పాతాళంల పాతిపెట్టినట్లయింది
ఇల్లు కళ్ళలోంచి కరిగిపోయి
మట్టి వాసన మచ్చుకైనా లేకుండా మాయమయింది

7. పుస్తకాల రెక్కలు కట్టుకొని
ఊరు దాటి ఎగిరి వచ్చినంక
జిందగీల కొత్త ఆట షరీక్ అయింది
ఉరుకులాట.... పెనుగులాట....
దేవులాట.... తన్లాట
గివ్వే ఇప్పటి ఆటలు
ఈ వేటలో యాదిలన్నీ తుక్‌డ తుక్‌డ అయినై
ఎండిన ఆకుల్లెక్క 'పటపట' ఇరిగిపోయినయి
అప్పుడప్పుడు వాన వచ్చినట్టు ఇల్లు గుర్తుకచ్చేటిది
గుండె చప్పుడు మతిలకచ్చేటిది
ఎదురుంగ ఉరికి ఉరికి మీదికచ్చి
మబ్బుల్ల పడి మాయమయ్యే మెరుపు.....

8. కనీ, ఎగిలివారంగ ఊళ్ళ నుంచి బైలెల్లి
సడక్ ఎక్కి, ఎడ్లబండెక్కి, ఎఱ్ఱబస్సెక్కి

రైలుబండెక్కి, ఆటోరిచ్చ ఎక్కి
పట్టపగటియాళ్ళకి
పట్నంల నేను పన్జేసే ఆఫీసుకు
నాయ్నా, నువ్వచ్చినవ్ సూడు
అప్పుడు –
మన ఇల్లు ఇల్లే
నా దగ్గరికి నడ్సి వచ్చినట్టనిపిచ్చె.....
ఎగిరిపోయిన పిట్టని ఎనుకులాడుకుంట
గూడే కదిలివచ్చినట్టనిపిచ్చె......

***(5 మార్చి 2017 'ఆంధ్రభూమి' దినపత్రిక 'సాహితి' పేజిలో ప్రచురితం)***

# 25

## సలి మంట

గీ కార్తి మొదలైనప్పట్నుంచీ
నా్రత్రయ్యిందంటే నా పెయ్యికి
గొంగట్ల సంసారమే అయ్యింది
సలి పెరిగె– పొద్దుగాల్నే సీకటి పడవట్టే
ఎన్నుపూసలు వనకబట్టే
బరిబద్దె బొక్కలు అరగబట్టె
మూడు కాళ్ల మనిషిని గదా
సెయ్యిల పట్టుకున్న కట్టె నిలువదాయె..

కాని కాలం అచ్చిందిరా లచ్చిగా!
ఒకనాడు నేను తంతె బండ పదారు వక్కలయ్యేటిది
గీ నాడు ర్యాగడ్ల నెర్రెలు తాకినా పాదాలు సలుపుతున్నై
గందుకె గొర్ల కాసుకోనికి పొద్దుగాల్నె పోయి



పొద్దుగూకే యాళ్ళ
ఊళ్లె బజార్ లైట్‌లు ఎయ్యక ముందే ఇంటికి అత్తాన..
ఆరుగాలం కష్టపడి పంటలు పండిత్తే ఏం మిగిలింది?
గుడిసె ముందు మ్యాట యేసిన గడ్డివామి తప్ప..
గదె గీ సలి దినాలల్ల నాకు కాసంత సాత్ ఇత్తాంది
దినాం కొంచెం గడ్డితీసి తెల్లారగట్లల్లనే సలిమంట ఏసుడు
గీ రోజులల్ల నాకు రివాజ్ అయ్యింది!

రాములు- సాయిలు- ఎంకటి
ఇంకా నా తోటోల్లంతా రోజూ కోడి కుయ్యంగానే
రగ్గులు గప్పుకొని వణుక్కుంట వణుక్కుంట
మంట కాడి కచ్చుడు అలవాటయ్యింది
గా సైమం ల గాల్లంతా
హరొక్క ముచ్చట చెప్తరాయే...

మొన్నటి దాకా- సలి మంట దగ్గరకు వచ్చేటోల్లంతా
ఒకటే మాట సెప్పెటోళ్లు
నాకు పురాగ ఏదీ సమజ్ గాలేదు గానీ
నెల పదిహేను రోజుల సమ్మె దేశంల హడల్ అయ్యిందని
డిల్లి గుండెలు కదిల్నాయని
ఇగ తెలంగాణను ఆపుడు దేవుని తోని కూడ కాదని
ఒకడ్ని మించి ఒకడు సెప్పబట్టే!

గా దినం ఊరోల్లందరితో గలసి నేను గుడా
మ్యాందారి ప్యాట స్టేజుమీద రాస్తా బందుకు యెల్లిన కదా
గందుకని తూర్పు తెల్లారినట్టు
తెలంగానత్తదని నేను గుడా ఎదురుసూడవడ్తి!

ఎంతైనా గీ మట్టిన బుట్టినోల్లం కదా
రేపు గీ మట్టిలోనే కల్సెటోల్లం కదా
మా బోటోల్లకు
మా బూమి మాగ్గావాలనిపిత్తది బిడ్డా
నాకు ఏ దేశంల ఏ రాజ్జెంల ఉంటె ఎమైతదో తెల్వది
లెక్కలు గిక్కలు భీ ఏం రావు
మీ అంత సద్వుకున్నోన్ని గాదు కదా
గనీ బిడ్డా, నాకు తెల్సిందల్లా ఒకటే లెక్క
బూమి మన కన్న అవ్వ లాంటిది
మన బూమి మనగ్గావాలె
మన అవ్వ మనగ్గావాలె... గంతే!

ఐతే గియ్యాల పొద్దుగాల పొద్దుగాల్నే
నా గుండెల్ల రాయి పడే–
తెలంగాణ తెలంగాణ అన్న లీడర్‌లు
'రెండు కండ్ల'లెక్క చెప్పిన నాయకులు
'విముక్తి' పాటలు పాడిన యోధులు
అసలు ముచ్చట పక్కకు పెట్టి

గిప్డు మజాలు చేసుకుంటుండ్రంటా
సుంకరి సాంబిగాడు సలి కాసుకుంట సెప్పిండు!

గది యిన్నంక
నా దిమాక్ దిర్గి పాయె– దిల్లు జారి పాయె
నాత్రంతా నిద్ర పట్టకపాయె–
కంటిపాప మీద రెప్ప వాలకపాయె
కొత్త సాలు కొత్త తెలంగాణల ఐతదనుకుంటె
పాల పొంగు మీద నీళ్లు చల్లినట్టాయె..
ఏం జెయ్యాలే.. ఇగ..

ఐతేమాయెగనీ, గాయ్నెవలో గీ సాలు కడాకు
బూలోకం మునిగిపోతదని సెప్పిండట కదా–
గది కాక ముందే
తెలంగాణ నా కండ్లబడితె మంచిగుండు బిడ్డా...!!

*(30 జనవరి 2012 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక 'వివిధ'లో ప్రచురితం)*

# 26

## సాపేక్షత !

1. "ఊరు మస్తుగ మారిపోయిందిర బై "
బొడ్రాయి పండుగకు ఊరికచ్చిన సోపతిగాళ్లందరూ
ఒక్క మాటగా చెప్పింద్రు
గల్లీలు–రోడ్లు–ఇండ్లు–చౌరస్తా–బజార్ లైట్లు
మొత్తం మారినై
మన చిన్నప్పుడు ఉన్నట్టుగ లేదు !

*ధ్యానమగ్నుడై ఉన్న బుద్ధుడు ఒక్కసారి ఉలిక్కి పడ్డాడు!*

2. "పట్నం మొత్తం మారిపోయింది మామా"
పెళ్ళికి వచ్చిన బంధు మిత్రులందరూ ప్రకటించింద్రు
Malls-Multiplexలు-Multi-Storied Apartmentలు
Parkలు-Pubలు-Function Hallలు - Fashion Storeలు

కొత్తయి వెలిసినై
మనలను పరేషానీల పడేసేటట్టుగ ఉన్నది !
*బుద్ధుడు నయనాలను అర్థ నిమీలితంగా తెరిచాడు!*

3. "Our country has got lot of changes, you know"
తండ్రి మరణ కర్మలకు విచ్చేసిన NRI ల మాట
Technology-Internet-Smart Phones-Wifi
IT-Carలు-Villaలు-Real Estate-Share Market
బాగా వాడుకలకి వచ్చినై
మన last visit లో ఉన్నట్టుగ లేదు !
పదేళ్లలో దేశంలో drastic change !
*బుద్ధుడు ఆందోళనగా*
*పద్మాసనం నుంచి లేచి కూర్చున్నాడు!*

4. "లోకం యావత్తూ చాలా మారిపోయింది
బొత్తిగా పాప భీతి లేకుండా తయారయింది"
ఆధ్యాత్మిక సమ్మేళనంలో వక్తలందరి నిర్ధారణ !
అప్రాచ్యాలు - అఘాయిత్యాలు- అకృత్యాలు-
అశాంతి-అభద్రత-అమానవత్వం
రోజు రోజుకీ విజృంభిస్తున్నై
లోక ధర్మం మారిపోయింది సుమా!
*బుద్ధుడు కళ్ళు పెద్దవి చేసి కలవరపడి*
*కాళ్ళు చాచి లేచి నిలుచున్నాడు !*

5. హఠాత్తుగా, ఏ దిక్కు నుండో దూసుకొచ్చిన సన్యాసి ఒకడు
అందరి వైపు తీక్షణంగా చూసి
భృకుటి ముడి వేసి కమండలం ఎత్తి ప్రశ్నించిండు
"నువ్వు మాత్రం అప్పుడు ఉన్నట్టుగానే ఉన్నవా
dress - address - style - life style
శారీరకం– బౌద్ధికం– మానసికం
అన్ని రకాలుగా మారావ్ కదా?
మట్టి–భూమి–వృక్షం–నది–సముద్రం
పవనం – వర్షం – ఆకాశం మారితే మాత్రం
ఊరికే గుండెలు బాదుకుంటున్నావ్ ?
యుగాంతం దాపురించినట్టు
కంటి నిట్టూర్పులు వదులుతున్నావ్ ?"

*బుద్ధుడు సమాధాన పడి*
*మళ్ళీ పద్మాసనం వేసి కూర్చున్నాడు!*

6. అప్పుడే, అటుగా వెళ్తున్న పిచ్చివాడొకడు
చింపిరి జుట్టును సవరించుకొని
మాసిన అంగీని చించేసి
నెత్తి కొట్టుకుంటూ గొంతెత్తి అరిచిండు –
"మారింది ఊరు– పట్నం– దేశం– లోకం కాదురా
ఎర్రి నా మనిషీ,

మీ పుర్రెల పుట్టిన ఆలోచనలు– మీ ఆశలు..
మీరు చెప్తున్న మార్పులు
మీ అత్యాశలకు పుట్టిన వికృత శిశువులు !”

*బుద్ధుడు చిరు మందహాసం చేసి*
*కళ్ళు మూసుకొని*
*మౌనంగా ధ్యానంలోకెళ్ళాడు !*

***(13 ఆగస్టు 2017 'నవ తెలంగాణ' దినపత్రిక 'సోపతి' ఆదివారం అనుబంధంలో ప్రచురితం)***

# 27

## సీత కుంట

వైతరణిని దాటితేనే మోచ్చం-
మన పురాణాల ముచ్చట ఇది
సీత కుంట దాటితేనే అచ్చురాల మోచ్చం-
మా చిన్నతనంల మాకు యెర్కైన ముచ్చట ఇది

సీత కుంట-
మా ఊరికి తొలి గడప
కండ్లు మూస్కొని కైలాసం భీ పోవచ్చు,
గనీ గా సీత కుంట నీళ్ళను కండ్ల సూడకుంట
నర మానవుడెవ్వడు మా ఊల్లె కాలు పెట్టలేడు
పట్నం పోవాల్నన్నా- పల్లెకు పోవాల్నన్నా
పక్కూల్లెకు పోవాల్నన్నా- పొలానికి పోవాల్నన్నా



సీత కుంట నీళ్ళు కాళ్ళకు అంటకుండా పోవడం
ప్రవరునికి గూడా ముష్కిల్ కీ బాత్ !

❀ ❀ ❀

సీత కుంట కట్ట
నా సద్వుకు నా బతుకుకు నడిమిట్ల వారధి
సీత కుంటకు ఇసొంట మా ఊరు
అసొంట మా పెద్ద బడి !

గా బడి దినాలల్ల సముద్రం ఎట్లుంటదంటే
నాకు, సీత కుంట లెక్క ఉంటదని అన్పిచ్చేది
పొద్దుగాల బడికి పోయేటపుడు
సీకటి బడే యాల్లకు ఇంటికచ్చేటపుడు
నేను సీత కుంటను సూస్కుంటనే నడ్సెటోన్ని

గా యాల్ల గీ సీతకుంట
నాకొక నీటి పుట్ట లెక్కగొట్టేది
పై నుంచి జారి పడి మేట యేసిన మబ్బు లెక్క గొట్టేది
దాన్లె అలలన్ని పాముల్లెక్క అన్పిచ్చేటియి
తెల్ల అంగీ – నేవీ బ్లూ నెక్కరు –బుజాల మీన వయ్యిలు
సడుగు మీన హవాయి చెప్పుల నడకలు.....
గానీ, కంటి పాపల నిండ సీత కుంట అలల కదలికలే...!

గా సీత కుంట కాలానికొక్క తీర్గ ఉండేటిది
మా ఊరి రైతుల్లెక్కనె ...

మనుషుల నడిమిట్ల ఉండి ఉండి
అది కూడా మన లెక్కనె బతుకుడు నేర్సుకున్నది ...!

ఎండా కాలంల గా సీతకుంట
నా అన్ని రకాల ఆటలకి -పరాష్కాలకి అడ్డా
కుంటంతా ఎండిపోయి -నీళ్లన్నీ ఇంకిపోయి
గక్కడెక్కడో నడిమిట్ల కొన్ని బురద నీళ్ళు ఉండేటియి
గా బురదలల్ల బుడ్డ పర్కల కోసం దిగితే
పాదాల వేళ్ళ సందుల లోంచి
నల్ల ర్యాగడి బురద ఇర్సుక అచ్చేది
ఎండి పోయిన కుంటలో పైకి తేలిన కట్లాయి చెట్లు
సుట్లు సుట్టుకున్న కరెంట్ వైర్ లెక్క అన్పిచ్చేటియి
ఇగ, కొసారి కొమ్మల్ల పెర్గిన
కట్లాయి పూలు  తెంపినామా,
మన చేతి నిండా పాలు...!

వానా కాలంల సీత కుంట
నిగనిగలాడే నిండు గంగాళం
బండ రాల్లన్ని ముప్పావల అంత  నీళ్ళల్ల మునిగి పోయి
నల్ల మబ్బు పరుపుల్లెక్క అవుపిచ్చేటియి
కట్లాయి తూడులు కాడలు కన్పిచ్చక
సిరఫ్ ఆకులు-పూలు నీళ్ళ మీద తేలుకుంట ఉండేటియి
చెరువు కట్టకు కింద అలలు తాకే దాక



పచ్చని గడ్డి నిండుగ మొల్సేది
అక్కడక్కడ తంగేడు చెట్లు పొదల్లెక్క పెరిగేటియి
సగం దాక నీళ్ళల్ల మునిగిన తుమ్మ చెట్లు
నీళ్ళ అద్దంల వాటి నిశానీలని సూస్కునేటియి
బర్రెలు అన్నీ నీళ్ళల్ల గాయబ్ అయి
వాటి తలకాయలు కొమ్ములు మాత్రమె
పైకి తేలుకుంట కన్పిచ్చేటియి !

చెర్వుకు రెండు పక్కలా అలలే
ఉతికి దండానికి ఆరేసిన వెండి ధోతిల్లెక్క నీటి అలలు!
కట్టకిటు వైపు పచ్చని పీతాంబరాలు పరిచినట్టుగా వరి పొలాలు !!

సూడంగా సూడంగా సీత కుంట కట్ట
మా ఊల్లెకు వారధి లెక్క అయింది
మొదుగాల ఇది సీత కుంటకు ఆనకట్ట లెక్కుండే
మట్టి బాట లెక్క – బండి బాట లెక్క
మొత్తానికి మనిషి బాట లెక్క ఉండే ....
ఎర్ర బస్సు షురూ అయిన సంది కంకర తోని సడుగు అయింది
పచ్చబస్సు అచ్చే కాలానికి అది డాంబర్ రోడ్ అయ్యింది
*“కట్ట బొయ్యి బాట అచ్చే డాం డాం డాం*
*బాట బొయ్యి సడుగచ్చె డాం డాం డాం*
*సడుగు బొయ్యి రోడ్డచ్చే డాం డాం డాం”*

గట్లనే  సీత కుంట సుతా మారిపొయ్యింది
నీల్లన్నిటిని మింగిన మనుషుల దెబ్బకు పారిపొయ్యింది
కుంట బొయ్యి చెరువచ్చింది
చెర్వు బొయ్యి పొలమచ్చింది
పొలం బొయ్యి పోలీసు కచ్చీరు అచ్చింది
మండలమచ్చింది – పంచాయితీ అపీసచ్చింది

గిప్డు పురాగ సీత కుంటే సచ్చింది.....!

*(బతుకమ్మ కుంట, సీత కుంట వంటి వందలాది చెరువులు భౌగోళిక పటం నుండి కనుమరుగవుతున్న స్థితికి చలించి....)*

***('అక్షర' – 13వ ఆటా మహాసభల జ్ఞాపక సంచిక, 2014లో ప్రచురితం)***



# 28

## తంగేడు పూల నేల

గీ లోకంల గీ మట్టికి
తీరొక్క రంగుల్ని అద్దుతున్నె యెవ్వా నీకు ఎర్కేనా ?
పువ్వులే !
పచ్చని చెట్లకు మంచిగ పూసే పువ్వులే !

గీ జమీన్ మీన
దునియా మొదలైన కాంచే వన దేవతలు
కట్టెంబడి– చెల్కెంబడి
పొలాల పొంటి – పానాదుల పొంటి
చిగురు పచ్చ పసుపు రంగుల్ని
ఇగురంగ అలికింద్రు
గవ్వే మన గడ్డ మీద
తంగేడు పూలై పూసినై !

గియ్యాల దాకా దేశమంతా పువ్వులంటే
బంతులు–చామంతులు–గులాబీలు –సన్నజాజులు
మల్లెలు–మందారాలు–కనకాంబరాలు–తామరలు
లిల్లీలు– Tulipలు – గ్లాడియోలస్ లు–గుల్ మొహర్ లు...
ఎక్కడ సూసిన గా పువ్వులే కనిపిచ్చేటియి
దండలల్ల – దండలల్ల –దర్వాజలల్ల–దండేల మీన
బొకేలల్ల – బారాత్ లల్ల– బజార్ లల్ల
ఎక్కడికెళ్ళినా గా పూలే రాజ్యమేలేటియి

గనీ, మా తెలంగాణల పువ్వులనంగనె
యాదికచ్చే పూలు తంగేడు పూలే !

గవ్వి–
మా ఆడబిడ్డల సేతులల్ల
సల్లంగ ఇమిడిపొయ్యే పసి పోరీలు
చెర్వు పక్కకెల్లినా – పొలానికి నీళ్ళు కట్టబొయ్యినా
గా పొంటే, పచ్చంగ నవ్వే పడుసు పిల్లలు !

గవ్వి–
చిగురాకుపచ్చ ఆకులతోని
పసుపు పచ్చ రెక్కలతోని
ముద్దులు మూట గట్టినట్టు

సమ్మక్కకు ముడుపు గట్టినట్టు
ముద్దలెక్క ముడ్సుకున్న కొత్త పెండ్లి పిల్లలు !

మా ఆడోల్ల సిగలల్ల కూసోని
గవాళ్ళ మొగోల్లకు సౌ సాల్ జిందగీనిచ్చే
పెద్ద ముత్తయిదువలు !

మా ర్యాగడి గట్ల పొంటి
అటెంక ఇటేంక పోతాంటే
పొద్దుగూకులూ తలకాయలు ఆడిచ్చుకుంట
మాతో పరాష్కాలాడే పెద్ద మనుషులు !

మా బతుకమ్మ సిబ్బిలల్ల
గునుగు పూలతో కల్సి
మా బతుకు పిరమిడ్ ను నిర్మించే అమర వీరులు !

గందుకే, తంగేడు పువ్వు అనంగనే
గీ నేల తల్లి గుండె సప్పుడై అదుల్తది
తీరొక్క వాసన మా మతిల మెదుల్తది
త్యాగాల సువాసనే పేగులల్ల కదుల్తది!

గిప్పటి సంది ఇక
తంగేడు పువ్వు అనంగనే
తెలంగాణ మట్టి పువ్వై మెరుస్తది!
తెలంగాణా ఆత్మ నిలబడి గెలుస్తది !!

*(తంగేడు పువ్వును తెలంగాణా రాష్ట్ర పుష్పం గా ప్రకటించిన సంబురంల....)*

***(1 డిసెంబర్ 2014 'నమస్తే తెలంగాణ' 'చెలిమె' పేజీలో ప్రచురితం)***



# 29

## వానెల్సినంక ....

1. పొద్దుణ్నించీ ఊరించి ఊరించి
సాయంకాలమే కురిసిన వర్షం-
మేఘం నెమరువేసుకుంటున్న
జ్ఞాపకాల సంకలనంలా ఉంది !
ఆకాశం -
తన నాలుగు కాలాల అనుభవాలని
నేలతో పంచుకుంటున్న
ఆత్మీయ సంభాషణలా ఉంది !!

నాక్కూడా
బాల్యపు కాగితప్పడవెక్కి
రాళ్ళ–వడగళ్ళ–చిరుజల్లుల–కుండపోతల
మా వాడ వానని గుర్తు చేసుకోవాలనిపిస్తుంది!

2. చిటపట చినుకుల తాకిడికి
పరిమళించిన మట్టివాసన
ఒక్కసారి ముక్కుకు తాకేసరికి
చటుక్కున లేచి
ఒక్కదుట్న వీధిలోకి పరుగెత్తుకొచ్చి
వాన హెచ్చుతున్న కొద్దీ
ఇంటి చూరువంక
చూరులోంచి దోనె గుండా
అంత దూరాన చిమ్ముతున్న నీటిపాయ వంక
చిత్రంగా చూస్తూ
బిందెల్లో నీళ్ళని పట్టే సాకుతో
ఒళ్ళని అసాంతం తడిపేసుకున్నాక
నిక్కర్ చివర్లోంచి బొట్లు బొట్లుగా
వాన నీళ్ళని రాల్చుకోవడం
అప్పట్లో నాకున్న గొప్ప సరదా ...

3. అరిపాదంతో నీటి గుంటలను నిర్మించడం
తడి మట్టితో నీటి ప్రవాహానికి
ఆనకట్టలు కట్టడం ....
నీటి పాయలో –
శరీరాన్ని సాగదీస్తూ సాగుతున్న
బాల్‌పెన్ లోని స్ప్రింగ్ లాంటి 'ఎర్రల్ని'
కళ్ళింత చేస్కుని చూడటం ...
న్యూస్ పేపర్‌ని
గిఫ్ట్ ప్యాక్‌పైని రంగుల ర్యాపర్‌ని
గత సంవత్సరపు క్లాస్ నోట్‌బుక్‌లోని పేజీలని
పడవలుగా రీసైక్లింగ్ చేయడం ...
వాన పంతులు బెత్తం లేకుండా
నాకు నేర్పించిన పాఠాలు ...

4. ఊరు మొదట్ల
'దేవుని చెర్వు' తూముకాడ
రివ్వున దూసుకెళ్తున్న బుడ్డపర్క చేపల్ని
కంటి చూపుతో పట్టేసి
చేతుల్తో వలేయడం ...
'నల్లకుంట'లో పూసిన తామరపూల కోసం
బర్రె తోక పట్టుకుని ఈదులాడటం ...
కుండపోత తగ్గి

తుప్పిరి వాన మొదలవగానే
మెయిన్ రోడ్ పైని ట్రైలర్ టేల నుండి
మా వీధి సందు దాకా
'సలాకాట' ఆడటం ...
'వాన
క్యాంప్'లో నేను సహజంగా నేర్చుకున్న నైపుణ్యాలు!

5. హోటల్ శంకరయ్య చేసిన
వేడి వేడి గ్యారెలు – మిర్చిల్ని,
కాశినాథం బండిలో వేయించిన
ఆలూ బజ్జీ – ఎగ్ బోండాల్ని
సాయితగాళ్ళతో కల్సి
ఎవ్వల కంట్లె పడకుండా తినడం ...
ఇంట్లో అమ్మ –
సగం పగిలిన మట్టికుండలో
కట్టెల పొయ్యిమీద
వేయించిన మొక్కజొన్న ప్యాలాలపై
పూసిన మొగ్గలను
సుతిమెత్తగా కొరికి మింగడం
వాన నీడల నేను చేసిన సాహసాలు!



6. ఇపుడిదంతా కలలాగా
SSCలో దిగిన Black & White Photoలాగా
గాలివాన తాకిడికి
నేలంతా రాలిపోయిన జాజిపూలలాగా
ఇంటి రేకులపై రాలిన బొండుమల్లె తోకని కొరికి
'పీ' ... అని పాడిన సన్నాయి పాటలాగా
బడి బావిలో పడి తేలిన
అల్లనేరేడు పండులాగా
కాల శిథిలాల మధ్య
జ్ఞాపక శకలం లాగా ....
నా చిన్నప్పటి జీవితంలాగా ...

వాన
వెలిసింది ...

*('తెలంగాణా కవిత 2006' లో ప్రచురితం)*

# 30

## 'యాకుత్ పురా'ణ శకలం

అరచేతుల్లో మెహందీ చిత్రాలు
అక్కడక్కడా బిర్యానీ వాసనలు
అడుగడుగునా బిద్రీ నగిషీలు
గజల్ గానా బజానాల చిల్మన్‌లు
ఒక పురాతన నగరమిది
చార్మినార్ నీడల్లో కమాన్ చూపుల్లో
ఇరుకిరుకుగా విస్తరించిన షహర్ ఇది !

సలామ్ వలేకుమ్ - వలేకుమస్సలామ్
ఇవ్వాళ ఝుమా- మసీదు కెళ్దాం పదరా మామా
'అల్లాహో అక్బర్' అజా సందు సందునీ జాగృతం చేస్తుంది

రైల్వే బ్రిడ్జి కింది రోడ్డుకు ఒక ప్రక్కగా
హసన్ దాదా తెల్లగడ్డంలోని బోసినవ్వు
జర్దా పాన్‌లో మెలితిరిగి ఎర్రబారుతుంది
ఆటో రిక్షా సర్వీసింగ్ సెంటర్‌లో
బారహ్ సాల్‌కా ఆలీ
నల్లా పైపులోని పానీలో చెమట చుక్కవుతుంటాడు

రెయిన్ బజార్‌లోని రంగీన్ ఛష్మే
కట్టీ జిందగీలపై
సాత్ రంగ్‌కీ సప్నేని పరుస్తుంటాయ్
సబా ఫుట్‌వేర్‌లోకి వెళ్ళిన పాదాలకి
జోడైన చెప్పులు ఎంతకీ దొరకవు
లగ్తాహై, రెహనా బీ తాలీ మె కుఛ్ కమ్ హోగా

ప్రక్కనే ప్రవహించే మురికి మూసీ నది
మత్తైన సెంటు పరిమళాల్ని గమ్మత్తుగా
జోంపీడీల్లోకి – పూరి పాకల్లోకి
అందులో ముడుచుకున్న దేహాల్లోకి వెదజల్లుతూంటుంది

మరోవైపున –
అస్రా కెఫేలో ఇరానీ చాయ్ – సమూసా
స్వాగత్ హోటల్ మజ్జిగ – రవ్వ దోశ
ఇరు ప్రపంచాలకు మౌనసాక్షులుగా మిన్నకుంటాయ్

అక్కడే –
బేల కళ్ల కింద సుర్‌మాతో మాసూమ్ అమీనాలున్నారు
సౌదీని కలల్లో సృష్టించుకుని పరుగెత్తే అమన్‌లున్నారు
రైలు పట్టాలపై ‘ఫలక్‌నుమా’ని దర్శించే
అంధా ముసల్ది, వజీరా, ఉంది

అక్కడే –
ముస్లింలున్నారు – హిందువులున్నారు
అన్నింటినీ మించి
‘గరీబీ’ అనే ఇంకొక మతమున్నాది

అనగనగా చార్‌సౌ సాల్ కా షహర్ ఉన్నాది
దాని నీడలో
‘యాకుత్‌పురా’ అను పాత నగర శకలమున్నాది ...

*(27.07.2003 ఆంధ్రభూమి దినపత్రిక ఆదివారం అనుబంధంలో ప్రచురితం)*

# శనార్తులు!

గౌ॥ శ్రీ **ఇఎస్ఎల్ నరసింహన్** గారు, *గవర్నర్, తెలంగాణ రాష్ట్రం*

గౌ॥ శ్రీ **చెన్నమనేని విద్యాసాగర్** గారు, *గవర్నర్, మహారాష్ట్ర*

గౌ॥ శాసన మండలి ఛైర్మన్ శ్రీ స్వామిగౌడ్ గారు, గౌ॥ శాసన సభ సభాపతి శ్రీ మధుసూదనచారి గారు.

గౌ॥ ఉపముఖ్యమంత్రివర్యులు – శ్రీ మహమ్మద్ మహమూద్ అలీ గారు, శ్రీ కడియం శ్రీహరి గారు.

గౌ॥ శాసన మండలి / శాసనసభ సభ్యులు – శ్రీ కర్నె ప్రభాకర్ గారు, శ్రీమతి గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి గారు, శ్రీ దాస్యం వినయ భాస్కర్ గారు, శ్రీ రసమయి బాలకిషన్ గారు, శ్రీ కురసాల కన్నబాబు గారు, శ్రీ శేరి సుభాష్‌రెడ్డి గారు, శ్రీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గారు, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు.

గౌ॥ డా॥ ఎస్. చెల్లప్ప, IAS గారు; శ్రీ SP సింగ్, IAS గారు; శ్రీ నిమ్మగడ్డ రమేష్ కుమార్, IAS గారు; శ్రీ జె. ప్రభాకర్ రెడ్డి, IAS గారు; శ్రీ రఫత్ అలీ, IAS గారు; శ్రీ జయేశ్ రంజన్, IAS గారు; శ్రీ అధర్‌సిన్హా, IAS గారు; శ్రీ కె. రామకృష్ణారావు, IAS గారు; శ్రీ వికాస్ రాజ్, IAS గారు; శ్రీ నవీన్ మిట్టల్, IAS గారు; శ్రీమతి శాంతికుమారి, IAS గారు; శ్రీ అశోక్ కుమార్, IAS గారు; శ్రీ టి. చిరంజీవులు, IAS గారు; శ్రీ రాహుల్ బొజ్జా, IAS గారు; శ్రీ రఘునందన్, IAS గారు; శ్రీ రొనాల్డ్ రోస్, IAS గారు; శ్రీమతి విశాలాచ్చి, IPoS గారు; శ్రీమతి క్రిస్టినా చోంగ్తు, IAS గారు; శ్రీ దానకిషోర్, IAS గారు; శ్రీ సురేంద్రమోహన్, IAS గారు; శ్రీమతి చిత్రా రామచంద్రన్, IAS గారు; శ్రీ బసంత్ కుమార్, IAS గారు; శ్రీమతి వాకాటి కరుణ, IAS గారు; శ్రీ అరవిందర్ సింగ్, IAS గారు; శ్రీ కర్నన్, IAS గారు; శ్రీమతి యోగితా రాణా, IAS గారు; శ్రీ లోకేష్ కుమార్, IAS గారు; శ్రీమతి విజయేందిర, IAS గారు; శ్రీ చంపాలాల్, IAS గారు; శ్రీ వాద్రేవు చినవీరభద్రుడు, IAS గారు; శ్రీ విజయ్‌కుమార్, IAS గారు.

గౌ॥ శ్రీ మహేందర్ రెడ్డి, IPS గారు, శ్రీ విశ్వప్రసాద్, IPS గారు, శ్రీ మహేష్ భగవత్, IPS గారు.

గౌ॥ శ్రీమతి సునీత భగవత్, IFS గారు; శ్రీమతి ప్రియాంక వర్గీస్, IFS గారు; శ్రీ రాజశేఖరరెడ్డి గారు (సెక్రటరీ టు గౌ॥ సీయం); శ్రీ రాంమోహనరావు గారు (ఫైనాన్స్).

గౌ॥ ప్రొ॥ ఘంటా చక్రపాణి గారు, శ్రీ సి.విఠల్ గారు, శ్రీ మంగారి రాజేందర్ గారు, శ్రీ కృష్ణారెడ్డి గారు, శ్రీ వి. ప్రకాష్ గారు, శ్రీ అల్లం నారాయణ గారు, డా॥ నందిని సిధారెడ్డి గారు, శ్రీ బి.ఎస్. రాములు గారు, శ్రీ బాదిమి శివకుమార్ గారు.

శ్రీ వనం జ్వాలా నరసింహారావు గారు, శ్రీ విజయ కుమార్ గటిక గారు, శ్రీ రమేష్ హజారీ గారు, శ్రీ సైదిరెడ్డి గారు, శ్రీ గౌలి శివకృష్ణ గారు, శ్రీ విజయ్ గారు, శ్రీ చంద్రశేఖర్ గారు.

గౌరవ మంత్రివర్యుల సహాయకులు శ్రీ బి.వి. రావు గారు, శ్రీ ప్రవీణ్ గారు, శ్రీ శ్రీనివాసరెడ్డి (PRO) గారు, శ్రీ వెంకట్ (PRO) గారు.

శ్రీ బి. నరసింగరావు గారు, శ్రీ విజయేంద్ర ప్రసాద్ గారు, శ్రీ శేఖర్ కమ్ముల గారు, శ్రీ ఇంద్రగంటి మోహనకృష్ణ గారు, శ్రీ కళ్యాణకృష్ణ కురసాల గారు, శ్రీ అడవి శ్రీనివాస్ గారు, శ్రీమతి మేడపాటి రామలక్ష్మి-వెంకట్ గారు, శ్రీ సాయికుమార్ గారు (హీరో), శ్రీ వేణు ఉడుగుల గారు, శ్రీ సాగర్ చంద్ర గారు, శ్రీ KVR మహేంద్ర గారు, శ్రీ వెంకట్ సిద్ధారెడ్డి గారు, శ్రీమతి రంజిని గారు.

శ్రీ కె. శ్రీనివాస్ గారు, శ్రీ శ్రీనివాసరెడ్డి గారు, శ్రీ కట్టా శేఖర్ రెడ్డి గారు, శ్రీ తిగుళ్ళ కృష్ణమూర్తి గారు, శ్రీ పరాంకుశం వేణుగోపాలస్వామి గారు, శ్రీ గుడిపాటి గారు, శ్రీ నారాయణరెడ్డి గారు, శ్రీ సురేష్ కోహెడ గారు.

శ్రీ డా॥ కృత్తివెంటి శ్రీనివాసరావు గారు, శ్రీ డా॥ ఎన్. గోపి గారు, డా॥ నాళేశ్వరం శంకరం గారు, శ్రీ సంగిశెట్టి శ్రీనివాస్ గారు, శ్రీ వేదకుమార్ గారు, డా॥ ఏలే లక్ష్మణ్ గారు, శ్రీ కె. కృష్ణమూర్తిగారు, శ్రీ చల్లా శ్రీనివాస్ గారు, శ్రీ ఓదెల వెంకటేశ్‌గారు, శ్రీ అశోక్ యాదవ్ గారు, శ్రీ నివాస్ గారు, శ్రీ నూతన్ గారు, శ్రీ కోవెల సంతోష్‌గారు, శ్రీ పూదూరి రాజిరెడ్డి గారు, శ్రీమతి సరస్వతి రమ గారు.

డా॥ తాడేపల్లి శర్మ గారు, శ్రీ నవీనాచారి గారు, శ్రీ రాజీవ్ సాగర్ గారు, శ్రీ శరత్ గారు, శ్రీ సంతోష్ గారు, శ్రీ ప్రణీత్ గారు, శ్రీ పూర్ణచందర్ గారు.

శ్రీ కోరెం అశోక్ రెడ్డి గారు, శ్రీ వెంకట నర్సింహారెడ్డి గారు, శ్రీ పి. భాస్కరాచారి గారు, శ్రీమతి సుమిత్ర గారు, శ్రీ శంకరయ్య (శశాంక) - శ్రీమతి కవిత గారు, శ్రీ పొన్నం అశోక్ గారు, శ్రీ పొన్నం రవిచంద్ర గారు, శ్రీ పొన్నేరి సురేష్ కుమార్ గారు, శ్రీ నర్సయ్య (స్పోర్ట్స్) గారు, శ్రీ బాలాచారి నామోజు గారు.

శ్రీ గడ్డం భాస్కర్ గారు, డా॥ చంద్రశేఖర్ - శ్రీమతి శ్రీదేవి గారు, శ్రీ మామిడాల శ్రీనివాసరావు - శ్రీమతి రశ్మి గారు, శ్రీ నూతి మధుసూదన్, భాగ్య, వసుమతి గార్లు, శ్రీ వంకాయలపాటి మురళీధర్‌రావు గారు, శ్రీ నంద్యాల అనంతరెడ్డి గారు, శ్రీ నంద్యాల ప్రేమ్‌కరణ్ రెడ్డి గారు, శ్రీ బాసాని సురేష్, శ్రీ మట్టా రాజశేఖర్‌రెడ్డి, శ్రీ తండా యాదగిరి, శ్రీ పసునూటి వెంకటేశ్, శ్రీ మంత్రి శ్రీనివాస్, శ్రీ జావీద్, శ్రీ పి.వి.జి. సతీష్.

*మా ఊరు శాయంపేటకు, పెరిగిన పట్టణం వరంగల్‌కు ఎదిగించిన మహానగరం హైదరాబాద్‌కు....*

**అందరికీ శనార్తులు!**

**- మామిడి హరికృష్ణ**

# *My Sincere Thanks to...*

***Sri Kalvakuntla Chandrashekar Rao** garu*
*Hon'ble Chief Minister, Govt. of Telangana*

***Sri K.T. Rama Rao** garu*
*Hon'ble Minister for MA&UD, Industries & IT E&C*

***Sri T. Harish Rao** garu*
*Hon'ble Minister for Irrigation*

***Sri Azmeera Chandulal** garu*
*Hon'ble Minister for Tribal Development, Sports, Tourism, Youth Services & Culture*

***Sri Pocharam Srinivas Reddy** garu*
*Hon'ble Minister for Agriculture, Co-operation, Marketing*

***Sri Joginapalli Santhosh Kumar** garu*
*Hon'ble Member of Parliament*

***Smt. Kalvakuntla Kavitha** garu*
*Hon'ble MP; Founder Presidnt - Jagruthi*

***Sri S.K. Joshi,** IAS*
*Chief Secretary, Govt. of Telangana*

***Sri Rajiv Sharma,** IAS (Retd.)*
*Chief Advisor to Govt.*

***Sri B.V. Papa Rao,** IAS (Retd.)*
*Advisor to Govt.*

***Sri G.K. Reddy,** IAS (Retd.)*
*Advisor to Govt.*

***Dr. K.V. Ramanachary,** IAS (Retd.)*
*Advisor to Govt.*

***Sri Burra Venkatesham,** IAS*
*Principal Secretary, YAT&C*

***Sri B.P. Acharya,** IAS*
*DG, MCRHRD*

***Sri Bhoopal Reddy,** IFS (Retd.)*
*Secretary to Hon'ble CM*

***Sri C. Partha Sarathi,** IAS (Retd.)*
*Principal Secretary, Agrl. & Co-opn.*

***Sri Veera Brahmaiah,** IAS*
*Commissioner, Registrar of Co-op. Societies*

***Sri Deshapathi Srinivas***
*OSD to Hon'ble C.M.*

**- Hari Krishna Mamidi**



# Ooriki Poyina Yaalla...

*Mamidi Hari Krishna*

*An Anthology of poems in Telangana Language*

***The book OORIKI POYINA YAALLA... (WHEN WE VISIT OUR HOME VILLAGE..), is an anthology of selected poems written in Telangana language from 1995 to 2018, portrays the fairs, festivities, lifestyle on one hand and the transformation of Telangana country life at various phases of modernization, on the other.***

***The poems depict the struggles - sacrifices, pains - pleasures, confusions-commotions, conficts - conclusions of the people, their nostalgia and the alienation with their roots, inevitably happening due to the globalisation, technological advancement etc., from the point of view of a common man and in people's language. These are the impeccable expressions straight from the heart of a true Telanganite. Every line of these poems sincerely represents the emotions than euphemism, attachments than allegories, man-mud relations than metaphors.***

ఊరికి పోవడం అంటే
'ఊరికే' పోవడం కాదు –
ఊపిరి కోసం పోవడం
తప్పనిసరై తప్పక పోవడం కాదు –
గతి తప్పకుండా ఉండడం కోసం పోవడం.

ఊరికి రావడం అంటే
'ఊరికే' రావడం కాదు –
బస్ పాస్, పాస్‌పోర్ట్, వీసాలను రీన్యూ చేసుకున్నట్లు
నా ఐడెంటిటీని మళ్ళీ పొడిగించుకోవడం...!
పొగచూరిన ఊపరితిత్తుల నిండా
తంగేడు పూల వాసనని
మురిపెంగా నింపుకోవడం...!

ISBN 978-93-5416-515-3

9 789354 165153

Swarajyam Publications
Hyderabad